

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ) సా.6.21

సహరి(బుధ) ఉ.4.52

ఏపీఈఏపీసెట్ -2024కు దరఖాస్తుల స్వీకరణ

ఏపీఈఏపీసెట్ చైర్మన్ జీవీఆర్ ప్రసాదరాజు

7లో





ఘన స్వాగతం

- భారీ ర్యాలీతో నిడదవోలుకు వచ్చిన కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్
- బ్రహ్మరథం పట్టిన నాయకులు, కార్యకర్తలు



కోటసత్తెమ్మ ఆలయంలో కందుల దుర్గేష్, భోగవల్లి

నిడదవోలు, మార్చి 12: నిడదవోలు నియోజకవర్గ జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్‌కు నిడదవోలులో ఘన స్వాగతం లభించింది. భారీ ర్యాలీని వందలాది మంది అనుసరించారు. రాజమహేంద్రవరం నివాసం నుంచి మంగళవారం ఉదయం దుర్గేష్ నిడదవోలుకు బయలుదేరారు. విజ్జేశ్వరం వద్ద జన సైనికులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా విజ్జేశ్వరం శివాలయంలోను, గోపవరం గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయంలోను, నిడదవోలులోని నంగాలమ్మ అమ్మవారి గుడిలోను, తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానులను ఉద్దేశించి దుర్గేష్ మాట్లాడుతూ జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళతానని చెప్పారు. నిడదవోలు నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటానని చెప్పారు. తొలిసారి నిడదవోలులో అడుగుపెట్టగానే అభిమానులు చూపిన ఆదరణ మరువలేనిదని అన్నారు. త్వరలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆయన చెప్పారు. నిడదవోలు అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మరో రెండు రోజుల్లో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ పెద్దలను స్వయంగా కలిసి మద్దతు కోరతానని చెప్పారు. ఆయన వెంట నిడదవోలు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగవల్లి ప్రసాద్, నిడదవోలు పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, మండల అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, అడ్డగర్ల వెంకటకృష్ణ, జనసేన రాష్ట్ర కార్యదర్శులు గంటా స్వరూప, ప్రియాసౌజన్య, నిడదవోలు పట్టణ మండల, ఉండ్రాజవరం, పెరవలి మండలాల జనసేన, తెలుగుదేశం పార్టీ, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం, మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఓటు నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. రాజానగరం మండలం తూర్పు గోనగూడెంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జగదీశ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కమిషన్ 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేలా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక స్వీప్ కార్యకలాపాలను చేపట్టాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఒక్క ఓటరు తప్ప కుండా పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథ్, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



సీట్లు.. సర్దుబాట్లు

- అభ్యర్థుల ఎంపిక తుది కసరత్తులో కూటమి పార్టీలు
- గోపాలపురం, కొవ్వూరు నేతలతో చంద్రబాబు సమీక్ష
- అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేసిన నాయకులు
- వైసీపీలో మాత్రం సమన్వయకర్తల్లో గుబులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి):

ఈ వారంలోనే ఎన్నికల షెడ్యూల్ రానున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాజకీయ పార్టీలతో పాటు అధికార వర్గాలలో కూడా ఈ ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేసింది. మరో పక్క రాజకీయ పార్టీలు కూడా సీట్ల కేటాయింపుపై కసరత్తును దాదాపు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు రోజుల క్రితం టీడీపీ-జనసేనతో బీజేపీ కూడా జత కట్టింది. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీన ఈ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో ఒక్కొక్కటీ క్లియర్

ఇప్పటికే టీడీపీ తొలి జాబితాలో రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించగా, జనసేన రాజా నగరం అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణను ప్రకటించిన సంగతి తెలిసిందే. తొలి జాబితాలో ప్రకటించకపోయినా తర్వాత రాజమహేంద్రవరం రూరల్ విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి, జనసేన నేత కందుల దుర్గేష్ మధ్య కాస్త టెన్షన్ ఏర్పడిన సంగతి తెలిసిందే. తర్వాత పరిణామాలలో కందుల దుర్గేష్‌ను నిడదవోలు ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించగా, రూరల్ నియోజకవర్గ సమస్య పరిష్కారం అయింది. గోరంట్లకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఇప్పటికే ఎన్నికల ప్రచార ఏర్పాట్లన్నీ ముమ్మరం చేశారు. ఇక పేరు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. నిడదవోలులో కందుల దుర్గేష్ మంగళవారం ప్రచారం కూడా మొదలు పెట్టారు. దీంతో టీడీపీ మూడు, జనసేనకు రెండు స్థానాలు క్లియర్ అయ్యాయి.



గోపాలపురం, కొవ్వూరుపై బాబు సమీక్ష

గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల పార్టీ ముఖ్యులతో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గోపాలపురం టీడీపీ అభ్యర్థి విషయంలో చాలా కాలం నుంచి అక్కడ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు పేరు వినబడుతోంది. కానీ అక్కడ జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజుతో విభేదాల వల్ల ఇంతవరకూ అధికారికంగా ప్రకటించలేదు. బాపిరాజు మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావుకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజుకు, ముళ్లపూడి బాపిరాజుకు మధ్య గ్యాప్ ఉంది. ఈ నేపథ్యంలో గోపాలపురంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులను, ముళ్లపూడి బాపిరాజు, ఇద్దరు స్టేట్ కమిటీ సభ్యులను కూడా పిలిచి టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం స్వయంగా మాట్లాడారు. మొదట మండల పార్టీల అధ్యక్షులు, స్టేట్ కమిటీ సభ్యులతో మాట్లాడినట్టు తెలిసింది. తర్వాత ముళ్లపూడి బాపిరాజు ఒక్కరితోనే మాట్లాడినట్టు సమాచారం. ఇక కొవ్వూరు అభ్యర్థి ఖరారు విషయంలో కొవ్వూరులో పార్టీ పెద్ద పెండ్యాల అచ్చిబాబుతో సమీక్షించారు. ఆయనతో పాటు ద్విసభ్య కమిటీ సభ్యులు కె.రామకృష్ణ, జొన్నలగడ్డ చౌదరి కూడా హాజరయ్యారు. ఏం చర్చించారనేది బయటకు రాలేదు. కానీ అభ్యర్థిని ఖరారు చేసే విషయంలో నిర్ణయాధికారం అధిష్ఠానానికి అప్పగించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ స్థానాలలో అభ్యర్థుల విషయంలో చంద్రబాబు స్పష్టమైన వైఖరితో ఉన్నట్టు సమాచారం. వారి పేర్లు అతి త్వరలో ప్రకటించనున్నట్టు పార్టీ వర్గాల నుంచి వస్తున్న సమాచారం. బీజేపీతో పొత్తు వల్ల రాజమహేంద్రవరం లోక్‌సభను తమకు కేటాయించాలని బీజేపీ అడుగుతున్నట్లు తెలిసింది. ఇది అధికారికంగా ప్రకటిస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పేరు కూడా ఎల్లుండే ప్రకటించే అవకాశం ఉంది.



ఏ క్షణాన ఏం జరుగుతుందో..!

వైసీపీ సమన్వయకర్తల గుండెల్లో రైళ్లు

వైసీపీ ఇప్పటికే నాలుగు అసెంబ్లీ స్థానాలకు, పార్లమెంట్ స్థానానికి సమన్వయ కర్తలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇంకా అనపర్తి, రాజానగరం, నిడదవోలు నియోజకవర్గ సమన్వయ కర్తలను ప్రకటించాల్సి ఉంది. కానీ వారు ఇప్పటికే నియోజకవర్గాలలో పనిచేసుకుంటున్నారు. కానీ వైసీపీ అధిష్ఠానం నేరుగా అభ్యర్థులను ప్రకటించకుండా, సమన్వయకర్తల పేరుతో ప్రకటించడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ప్రకటించిన వారితో పాటు, ప్రకటించని వారిలో కూడా చివరి వరకూ ఏమవుతుందోననే ఆందోళన ఉంది..

అనపర్తి ఆస్పత్రిలో ఆహారం తినలేం..!



అరకొరగా..అదీ నాసిరకం భోజనం



కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం ఇదే..

అనపర్తి, మార్చి 12 : అనపర్తి ఏరియా ఆసుపత్రిలో సదుపాయాలు మాట అటుంచితే ఇక్కడ రోగులకు అందించే ఆహారం అధ్వానంగా ఉంటోంది. మెనూ ప్రకారం కాకుండా అరకొరగా పంపిణీ చేస్తున్నారని అదీ నాసిరకం భోజనంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అల్పాహారం, భోజనం అందించేందుకు రాష్ట్రంలో ఒక సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. అయితే ఆ కాంట్రాక్టరు ఎక్కడికక్కడ సబ్ కాంట్రాక్టులు ఇవ్వడంతో ఇక్కడ స్థానికంగా ఉండే రెస్టారెంటు యజమాని ఆసుపత్రిలో రోగులకు భోజనం సరఫరా చేస్తున్నాడు. రోజు వారి రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం అందించాల్సి ఉండగా ఇక్కడ మాత్రం సబ్ కాంట్రాక్టరు ఒక్క మధ్యాహ్నం పూట మాత్రమే భోజనం సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇదంతా ఎప్పటి నుంచో జరుగుతున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. గత కొద్దికాలంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా ఉన్న బాల భోజనం క్వాలిటీ, క్వాంటిటీపై సరఫరా దారుడితో గొడవపడుతూ వస్తున్నాడు. రెండు రోజుల క్రితం వీరిద్దరి మధ్య వివాదం పెద్దది కావడంతో విషయం వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న మీడియా అక్కడికి వెళ్లగా పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. కేవలం ఒక్క పూట మాత్రమే రోగులకు భోజనం అందించడం అదీ రైస్ సరిపడ ఇవ్వకపోవడం, సాంబారు, పెరుగు నోటిలో పెట్టుకునే విధంగా లేకపోవడంతో రోగులు తమకు ఇచ్చిన భోజన పొట్లాలను చెత్తకుప్పలో పడేస్తున్నారు. ఒక వైపు సబ్ కాంట్రాక్టు ద్వారా భోజనాలు సరఫరా చేసే వ్యక్తి, మరో పక్క ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఇద్దరూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కావలసిన వారు కావడంతో తప్పు ఒప్పులను చెప్పేందుకు ఎమ్మెల్యే కూడా ఒకింత వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. ఆసుపత్రి వైద్యులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ దీనిపై ఎమ్మెల్యే దృష్టి సారించినట్టు కనబడటం లేదు. ఏది ఏమైనా రోగంతో ఆసుపత్రికి వచ్చిన పేదలకు అందించే భోజనంలో రాజీ పడకూడదని పరిస్థితులపై ఆరా తీసి రోగులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ హాల్ టికెట్లు

విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకా యిలకు హాల్ టిక్కెట్‌కు లంకె పెట్టి పదో తరగతి విద్యార్థులను పలు ప్రైవేటు పాఠశాలలు ఇబ్బందులకు గురి చేస్తుండడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'టెన్షన్ పెట్టేస్తున్నారు' కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. హాల్ టికెట్ తీసుకోవడంలో విద్యార్థులకు ఊరట కలిగించే చర్యలు తీసుకున్నారు. పదో తరగతి హాల్ టికెట్లను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచామని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైటు నుంచి హాల్‌టికెట్‌ని డౌన్‌లోడ్ చేసుకొని తీసుకున్న ప్రింట్‌తో నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆ హాల్ టికెట్లను కూడా అనుమతించాలని జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లోని ప్రధాన పర్యవేక్షకులు, శాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్‌ను తీసుకొచ్చిన విద్యార్థులను పరీక్షకు తిరస్కరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని డీఎస్ఈవో చెప్పారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు.



2 ఎక్స్‌ప్రెస్‌లకు కొవ్వూరులో హాల్ట్

7లో



వందేభారత్ పరుగులు

ట్రైల్ రన్‌లో భాగంగా పలు స్టేషన్లలో హాల్ట్

7లో

దళితులే జగన్‌ను దించేస్తున్నారు..

- శవ రాజకీయాలు చేసే నీచ సంస్కృతి జగన్‌ది..
- దళితుల అభ్యున్నతి టీడీపీతోనే
- దళిత శంఖారావంలో మహాసేన రాజేష్



దళిత శంఖారావం సభలో రాజేష్‌ను బుచ్చయ్యచౌదరిని సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు



దళిత శంఖారావంలో మాట్లాడుతున్న మహాసేన రాజేష్

రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ ,మార్చి 12: ఓట్లు వేసి అధికారంలోకి తీసుకువచ్చిన దళితులపై నాలుగేళ్ల 11 నెలల పాలనలో అనేక దాడులు చేయించిన జగన్‌ను తిరిగి ఆ దళితులే దించేయడానికి రెడీగా ఉన్నారని, జగన్‌కు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేసేందుకు సిద్ధమయ్యారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బీఆర్‌కేలో మంగళవారం టీడీపీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఆర్.ఆంటోని అధ్యక్షతన టీడీపీ-జనసేన దళిత శంఖారావం సమావేశం జరిగింది. టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ మాట్లాడుతూ ఒక దళితుడిని చంపిన వాడిని జగన్‌రెడ్డి పక్కన పెట్టుకుని తిరుగుతున్నాడన్నారు. దళితులకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వలేదన్నారు. దళితులపై ఇన్ని అరాచకాలు చేసిన జగన్‌రెడ్డీ. కాస్కో.. దళితుల సత్తా ఏంటో ఈ ఎన్నికల్లో చూపించబోతున్నాం..అని రాజేష్ అన్నారు. 'తండ్రి శవాన్ని పార్టీకి వాడుకున్నావు. బాబాయి శవాన్ని వాడుకుని అధికారంలోకి వచ్చావు. ఇప్పుడు ఒక అమ్మాయి చనిపోతే టీడీపీ, జనసేన కారణమని ట్రోల్ చేస్తూ ఈ సంఘటనను కూడా ప్రచారానికి వాడుకుంటున్నావా జగన్ రెడ్డి' అని అన్నారు. శవాలను రాజకీయంగా వాడుకునే నీచ సంస్కృతి జగన్‌దని మండిపడ్డారు. దళితుల సంక్షేమం చంద్రబాబు పవన్ కల్యాణ్ వల్లే సాధ్యమవుతుందన్నారు. ప్రతి దళితుడు ఆలోచించుకోవాలని ఒక్కొక్కరు వంద మందితో కూటమికి ఓటు వేయించాలన్నారు. ఒక దళితుడిని అత్యున్నత లోక్‌సభలో స్పీకర్ పదవిలో కూర్చోపెట్టిన చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజమహేంద్రవరం రూరల్ బుచ్చయ్యచౌదరి అడ్డా అని ఆయనతో పెట్టుకునే సత్తా ఎవరికీ లేదన్నారు. గోరంట్ల మళ్లీ విజయం సాధించడం ఖాయమన్నారు. రాజమండ్రిలో తనపై ఎక్కడ ఎటాక్ జరిగిందో అదే ప్రాంతంలో బుచ్చన్న విజయోత్సవ ర్యాలీ చేస్తానన్నారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక దళితులను దారుణంగా దగా చేశాడన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేశాడని, ఉద్యోగాలు, ఉపాధి లేదన్నారు. దళితుల సంక్షేమానికి చంద్రబాబు అమలు చేసిన 27 పథకాలను జగన్ రద్దు చేసి ద్రోహం చేశాడన్నారు. రూ.35 వేల కోట్లు దారి మళ్లించారని చెప్పారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పొట్టన పెట్టుకున్నాడన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్య పథకంతో వేలాది మంది విద్యార్థులకు విదేశీ విద్యను చేరువ చేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1539 ఇన్నోవా కార్లు, 7500 బొలెరో వాహనాలు, 5 వేల ఆటోలు, 500 ట్రాక్టర్లు, 200 జేసీబీలు ఇచ్చి వారి జీవనోపాధికి బాటలు వేశారని గుర్తు చేశారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావాలని తాను మళ్లీ ఎమ్మెల్యే కాగానే రూరల్‌లో 10 వేల ఇళ్లు నిర్మించి అర్హులైన ప్రతిఒక్కరికి ఇంటిని ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. దళితుల శ్మశాన వాటికలను పరిరక్షించి అభివృద్ధి చేస్తామన్నారు. కేఎస్ జవహర్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో దళితులను అన్నివిధాల ఆదుకుని అభివృద్ధి చేసింది చంద్రబాబేనని అన్నారు. జగన్ రాష్ట్రంలో దళితులను దారుణంగా మోసం చేశారన్నారు. దళితులంతా నిర్ణయించుకున్నారని జగన్‌ను దించేస్తారన్నారు. గన్నికృష్ణ మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని చెప్పారు. దళితులు బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. గోరంట్లను మంత్రిగా చూడాలన్నారు. అనంతరం దళిత నేతలు గోరంట్లను సత్కరించారు. టీడీపీ నాయకులు నున్న కృష్ణ, తలారి మూర్తి, రొంపిచర్ల ఆంటోని, యార్లగడ్డ శేఖర్, జల్లి కృపానంద్, శీలం రవికుమార్, బోలా జాన్, కాయల సత్యనారాయణ, ముత్తాబత్తుల విజయమ్మ, చింతపర్తి నాగేశ్వరరావు, మందపల్లి రత్నరాజు, రాయిడి సునీత, ముత్యం సురేష్, కె.బుల్లియ్య, పల్లి ప్రసాద్, కె.రత్నకుమారి, బి.హేమలత, నేతల పాపారావు, సాయి, చింతపర్తి నాగేశ్వరరావు, చింతపర్తి సావిత్రి తదితరులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సభకు హాజరైన దళితులు, నేతలు



మాట్లాడుతున్న జవహర్

ఏపీఈఏపీసెట్ -2024కు
దరఖాస్తుల స్వీకరణ

● ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు



జేఎన్టీయూకే, మార్చి12: రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్,అగ్రికల్చర్, ఫార్మసీకామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్) -2024 నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసినట్లు ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. దీనికి సంబంధించిన దరఖాస్తులను మంగళవారం నుంచి స్వీకరిస్తున్నామన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 15 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే13 నుంచి 19 వరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహిస్తామని ఏపీలో 47, హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్, సికింద్రాబాద్‌లలో రెండు కేంద్రాలు, మొత్తం 49 ప్రాంతీయ కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. https://cets/apsche.ap.gov.in/ EAPCET_HomePage.aspx లింక్ ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తులను పూరించాలన్నారు. ఇంజనీరింగ్‌కు సంబంధించి మే13 నుంచి 16 వరకూ, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు మే17 నుంచి 19 వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రూ.500 అపరాధరుసుముతో ఏప్రిల్ 30వరకూ, రూ.1000తో మే 5వరకూ, రూ.5000 అపరాధ రుసుముతో మే10, రూ.10,000 అపరాధరుసుముతో మే12 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్షలను ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ, మధ్యాహ్నం 2.30నుంచి 5.30 గంటల వరకూ రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 08842359599, 2342499 లో సంప్రదించాలని సూచించారు.

జాబ్ ఫెస్ట్‌లతో
ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సీఈ శోభారాణి



జాబ్ ఫెస్ట్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శోభారాణి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12 : విద్యార్థులకు డిగ్రీ పట్టాను అందించడమే కాకుండా వారిని ఉద్యోగస్థులుగా చేసి పంపించాలనే లక్ష్యంతో జాబ్ ఫెస్ట్ ఏర్పాటు చేసినట్లు జోన్ -1, జోన్- 2 కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సీఈ బి.శోభారాణి చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జాబ్‌ఫెస్ట్-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ జాబ్‌ఫెస్ట్‌కు 10 నోడల్ రిసోర్సు సెంటర్ల నుంచి 750 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, ఐటీ మొదలైన రంగాలకు చెందిన 24 కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు. 269 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఎన్‌ఆర్‌సీ కో ఆర్డినేటర్ తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ, నోడల్ రిసోర్సు సెంటర్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ ఫెస్ట్‌లో ఆయా సంస్థల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆది' నుంచీ వివాదాస్పదమే!

● పోలవరం ప్రాజెక్టు పాలకుడిగా, స్పెషల్ కలెక్టరుగా నిర్వాసితులకు ఒరిగింది శూన్యం

రంపచోడవరం, మార్చి 12 : ఆయన ఓ అఖిల భారత సర్వీసుల అధికారి. ప్రభుత్వ నిబంధనల మేరకు రాగద్వేషాలకు అతీతంగా ప్రజాప్రయోజనాల కోసం అందరినీ గౌరవిస్తూ బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రజాసేవకుడిగా మంచి పేరు తెచ్చుకోవాల్సిన ఆయన వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సీవీ ప్రవీణ్ ఆదిత్యను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం సోమవారం పశ్చిమగోదావరి జేసీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మూడున్నరేళ్లకుపైగా పనిచేసిన ఆయనను పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా నియమించారు. దీంతో అక్కడి జనసేన పార్టీ నాయకులు నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఈ విషయాన్ని ఫిర్యాదుచేశారు. ఈయన నియామకం ద్వారా ఎన్నికల సమయంలో ఆయన్ను అనుకూలంగా వాడుకోవాలని ప్రణాళిక వేసినట్టు జనసేన ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఆయనపై బదిలీ వేటు పడింది. వాస్తవానికి ప్రవీణ్ ఆదిత్య పూర్తిగా వైసీపీ అనుకూల అధికారిగా ఎప్పటినుంచో ముద్రపడింది. రంపచోడవరం సబ్ కలెక్టరుగా ప్రస్థానాన్ని మొదలు పెట్టి, తర్వాత రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పదోన్నతి పొంది, తర్వాత కాలంలో జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు పరిపాలకుడిగా చేరి, భూసేకరణకు స్పెషల్ కలెక్టరుగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. అయా సమయాల్లో కూడా వివాదాస్పద వైఖరినే అవలంబించారనే ఆరోపణలు వచ్చాయి. జాతీయ హోదాతో ఉన్న పోలవరం ప్రాజెక్టుకు పాలకుడిగా వ్యవహరించిన కాలంలో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసాన్ని కల్పించకుండా గ్రామాలను ఖాళీ చేయించి ప్రభుత్వ మెప్పు పొందడానికి తాపత్రయపడ్డారని పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. గిరిజన నిర్వాసితులకు భూమికి బదులుగా భూమిని సమకూర్చకుండానే గ్రామాలను ఖాళీ చేయించిన వైనం, పునరావాసం కోసం భూములను సేకరించే ప్రక్రియ చేపట్టి వారి నుంచి అప్పనంగానే భూములను కాజేసి మెప్పు పొందే క్రమంలో భూయజమానులపై తప్పుడు కేసులు బనాయించడం, గిరిజనేతర నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించకుండానే వారిని మైదాన ప్రాంతాలకు తరలించడమే కాకుండా వారి ఓట్లు మైదాన ప్రాంతానికి తరలిపోయే పరిస్థితికి కారణమయ్యారని ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఇప్పటికే పునరావాస వైఫల్యాలపై ఎన్నో ఉద్యమాలు, కోర్టు కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఇక రంపచోడవరం ఐటీడీఏలో విధులు నిర్వర్తిస్తున్న కాలంలో తెలుగుదేశానికి చెందిన ఓ గిరిజన మహిళా మాజీ ఎమ్మెల్యేను కింద కూర్చోబెట్టడం, ముఖ్యమంత్రి మెచ్చిన ఓ దివ్యాంగుడైన ఉత్తమ అధికారిని సైతం దూషించి అవమానించడం వంటి తీరు ఆయనను వివాదాస్పదుడిగా చూపుతున్నా ప్రభుత్వం ఆయనకు అండగా నిలిచింది. ఆ కారణంగానే మూడున్నరేళ్లకుపైగా ఈయన ఒకే జిల్లాలో కొనసాగారని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు.

చోరీలకు పాల్పడుతున్న
అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్టు



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ ప్రమోద్

పిఠాపురం, మార్చి 12: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను కాకినాడజిల్లాలో పిఠాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మురళీమోహన్‌లు మంగళవారం సాయంత్రం వెల్లడించారు. పెదపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామానికి చెందిన పలకా అశోక్‌కుమార్ కలెక్షన్ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో కలెక్షన్ చేయగా వచ్చిన మొత్తం రూ.1.80లక్షలను మోటార్‌సైకిల్ డిక్కీలో పెట్టుకుని మెయిన్‌రోడ్డులో గల వరలక్ష్మి కట్‌పీసెస్ షాపువద్ద పార్కుచేసి మేడమీదకు వెళ్లి వచ్చి చూసుకునే సరికి డిక్కీ తెరిచి ఉండగా నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. మార్చి 1వ తేదీన జరిగిన ఈ సంఘటనపై కేసు నమోదుచేసి కాకినాడ ఐటీ కోర్ టీమ్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలోని క్రైమ్ సిబ్బంది అందించిన సహకారంతో అడిషనల్ ఎస్ఐ వెంకటేష్ నిందితులను గుర్తించారు. మంగళవారం జగ్గయ్యచెరువు కాలనీలో ఉన్న అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఏజెన్సీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాకిరెడ్డి కృష్ణ(బాలకృష్ణ), మేకల హరికిరణ్(పండు)లను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.1.04లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో గండేపల్లి, గొల్లప్రోలు, ఏలేశ్వరం పోలీసుస్టేషన్లతోపాటు తెలంగాణాలోని మహబూబాబాద్ పరిధిలో పలు కేసులు ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

బంగారు వస్తువులు
దొంగిలించిన యువకుల అరెస్టు



బంగారు గొలుసు దొంగల చాయాచిత్రం

ముమ్మిడివరం, మార్చి 12: మహిళ మెడలో బంగారు గొలుసును దొంగిలించుకుపోయిన ఇద్దరు యువకులను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. గత నెల 28న బందరుపాలేనికి చెందిన కోళ్ల సత్యవతి కొత్తలంక వివాహ కార్యక్రమానికి వెళ్లేందుకు రోడ్డు పక్కన నిరీక్షిస్తుండగా మోటారుసైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. మహిళ ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా గాలించగా కాట్రేనికోన మండలం గచ్చకాయలపొరకు చెందిన పొన్నమండ సుబ్బరాజు, గాడి శివనాగరాజులుగా గుర్తించి వారిని ముమ్మిడివరం ల్యాంపు కళాశాల సమీపంలో మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

నేడు భీమేశ్వరాయంలో హుండీల లెక్కింపు

సామర్లకోట, మార్చి 12: కాకినాడజిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం ఉదయం భక్తుల సమక్షంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 6నుంచి సోమవారంరాత్రి వరకూ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు హుండీల ద్వారా వేసిన కానుకలు, పూజా రుసుముల ద్వారా వచ్చిన ఆదాయాలను బుధవారం లెక్కించనున్నట్లు ఈవో నీలకంఠం తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

యానాం, మార్చి 12: యానాం నియోజకవర్గంలో ఒక గ్రామానికి చెందిన బాలికను వివాహం చేసుకున్న యువకుడిపై కిడ్నాప్, బాల్య వివాహచట్టం, పోక్సో చట్టం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మురుగానందం తెలిపారు. పాఠశాలలో చదువుతున్న బాలికను తిరుపతి తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. తర్వాత వారు కాకినాడ చేరుకోగా అదుపులోకి తీసుకుని యానాం తీసుకువచ్చి వైద్యపరీక్షలు జరిపించి, పోక్సో తదితర సెక్షన్లకింద యువకుడిపై కేసు నమోదు చేశారు. యానాం సబ్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించా రు. మంగళవారం పుదుచ్చేరిలోని కాలాపేట సెంట్రల్ జైలుకు తరలించారు.

విధుల్లో పోలీసులు అప్రమత్తత

● ఓ ప్రయాణికుడి బ్యాగ్‌లు సురక్షితం

● రూ.81 వేల నగదుతో అప్పగింత



బ్యాగ్‌ని, అందులోని నగదును అందజేస్తున్న సీఐ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషనులో రెండు బ్యాగులను మరిచిపోయి వెళ్లిపోయిన ప్రయాణికుడికి టూటౌన్ పోలీసులు సురక్షితంగా వాటిని అందజేశారు. కపిలేశ్వరపురానికి చెందిన ఏడ్నూతుల వెంకటరమణ మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కాశీ నుంచి రాజమహేంద్రవరం రైలులో వచ్చారు. కపిలేశ్వరపురం వెళ్లడానికి కారు ఎక్కే క్రమంలో రెండు బ్యాగ్‌లను మెయిన్‌గేటు వద్ద ఆదమరుపుగా వదిలి వెళ్లిపోయారు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న టూటౌన్ సీఐ వి.శ్రీనివాసరావు వాటి గురించి ఆరా తీయగా ఫలితం లేకపోయింది. దీంతో వాటిని స్టేషనుకు తీసుకొచ్చి బ్యాగ్‌లను పరిశీలించి ఆధార్ కార్డు ఆధారంగా వెంకటరమణకు సమాచారం ఇచ్చారు. ఆయన టూటౌన్ స్టేషనుకు రావడంతో బ్యాగ్‌లను అప్పగించారు. ఓ బ్యాగ్‌లో రూ.81వేలు ఉన్నాయని, పోలీసుల దయవల్ల ఆ నగదు సురక్షితంగా దక్కిందని బాధితుడు పేర్కొన్నాడు. సీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా విధుల్లో నిబద్ధత చూపిన సీఐ శ్రీనివాసరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

బాలికను వేధించిన కేసులో
యువకుడికి ఏడేళ్ల జైలు

అంబాజీపేట, మార్చి 12: బాలికను ప్రేమపేరుతో వేధించడంతో పాటు ఆ బాలిక ఫొటోలు మార్ఫింగ్ చేసి చంపుతానని బెదిరించిన యువకుడికి ఏడేళ్ల జైలు, రూ.11వేలు జరిమానాను కాకినాడ కోర్టు విధించిందని ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. అంబాజీపేట మండలానికి చెందిన బాలికను చప్పిడి అర్జున్ వేధిస్తూ చంపేస్తానని బెదిరించడంతో 2020 జూలైలో ఆ బాలిక నిందితుడిపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ షేక్ జానీబాషా ఆ యువకుడిపై పోక్సో చట్టంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాకినాడ కోర్టులో స్పీడ్ ట్ర యల్ నిర్వహించారు. ఈకేసులో పీపీ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరపు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు నిందితుడికి ఏడేళ్ల జైలు, రూ.11వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసు దర్యాప్తులో కృషిచేసిన అప్పటి ఎస్ఐ షేక్ జానీబాషా, ట్రయల్‌లో కృషిచేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నేటి నుంచి కొవ్వూరులో 2 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

కొవ్వూరు, మార్చి 12: ఈ నెల 13వ తేదీ నుంచి కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొత్తగా రెండు రైళ్లకు ప్రయోగాత్మక పరిశీలన కోసం హాల్ట్ కల్పిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. 17479-17480 తిరుపతి - పూరి ఎక్స్‌ప్రెస్, 17481-17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు బుధవారం నుంచి కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆపనున్నారు. 17480 తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ రాత్రి 10-05గంటలకు, 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9-02గంటలకు కొవ్వూరు చేరుకుంటుంది. అలాగే 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9-02గంటలకు, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10-05గంటలకు కొవ్వూరు చేరుకుంటుంది. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు కోరుతున్నారు.

అంతర్‌జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు

గండేపల్లి, మార్చి 12: కాకినాడజిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ జాతీయరహదారిపై కట్టుదిట్టమైన, పటిష్టమైన భద్రతతో కలిగిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును ఏర్పాటుచేసినట్లు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఉత్తర్వుల ప్రకారం గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది సహాయంతో చెక్‌పోస్టు ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కాకినాడ జిల్లాకు సరిహద్దుగా మురారిలో ఏర్పాటు చేశామని సీఐ లక్ష్మణరావు వివరించారు. 24గంటలు నిరంతరం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేస్తుంటారన్నారు.



మురారి హైవేపై అంతర్‌జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటుచేసిన దృశ్యం

కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి
శివరాత్రి ఆదాయం రూ.10,43,545



ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కె.గంగవరం, మార్చి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వర స్వామి ఆలయానికి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.10,43,545 ఆదాయం వచ్చింది. దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.5,70, 440, విరాళాలు ద్వారా రూ.55,400, హుండీల ద్వారా రూ.4,17,705 వచ్చినట్లు ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్ ప్రసాద్, ఈవో ఎం.శ్రీదేవి తెలిపారు. ట్రస్టుబోర్డు చైర్మన్ పిల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు సమక్షంలో కానుకలను లెక్కించారు.

వైభవంగా వీరేశ్వరుని రథోత్సవం



మురమళ్ల వీధుల్లో ఊరేగుతున్న వీరేశ్వరస్వామి.

ఐ.పోలవరం, మార్చి 12: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆసీనులైన వీరేశ్వరస్వామి మురమళ్ల వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కేరళ డప్పు వాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణ, బుట్టబొమ్మల ఆటపాటలు, మిరుమిట్లుగొలిపే బాణసంచా కాల్పుల మధ్య ఊరే గింపు జరిగింది. ఆలయం నుంచి మురమళ్ల పుష్కరఘాట్ వరకు స్వామి వారి ఊరేగింపు జరిగింది. పుష్కరఘాట్‌వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమా లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, దాట్ల ఇంద్రరాజు, సర్పంచ్ కాలే రాజబాబు, కొలిశెట్టి గంగబాబు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు

కనుల పండువగా తెప్పోత్సవం

● గోదావరిమాతకు పంచహారతులు

● శివనామ స్మరణతో మార్మోగిన గోదావరి తీరం



వృద్ధగౌతమీనదిలో హంసవాహనంపై స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారంరాత్రి మురమళ్ల భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి తెప్పోత్సవం కన్నులపండవగా జరిగింది. పవిత్ర వృద్ధగౌతమీనదిలో హంసవాహనంపై ఆసీనులై వీరేశ్వరస్వామి నదీ విహారం చేశారు. స్వామి తెప్పోత్సవం కనులారా తిలకించిన భక్తులు శివనామస్మరణంతో పులకించారు. తొలుత ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు, పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు దంపతులు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గోదావరి మాతకు పంచహారతుల కార్యక్రమం జరిగింది.

దుర్గాడలో శ్రీపుష్పయాగం



దుర్గాడ శివాలయంలో శ్రీపుష్పయాగం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం, పాల్గొన్న భక్తులు

గొల్లప్రోలు రూరల్, మార్చి 12: కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు త్రిశూలస్నానం చేయించి శ్రీపుష్పయాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు దంపత దాంబూలాలు అందజేశారు. అంతకు ముందు భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రెండో వందేభారత్ పరుగులు



రాజమహేంద్రవరంలో వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో వందేభారత్ రైలువద్ద ప్రయాణికుల సందడి

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ రైలు ట్రైల్ రన్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.50గంటలకు రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు చేరుకొంది. రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు ఘన స్వాగతం పలికారు. రైలులో ట్రైల్ రన్ ఈవెంట్ సమన్వయాధికారి, విజయవాడ డీఈఎన్ ఎస్.రవికుమార్ వచ్చారు. ఈ రైలు 20708 నంబరుతో ఈనెల 13న విశాఖ నుంచి, 20707 ఈనెల 15న సికింద్రాబాద్ నుంచి ప్రతిరోజూ 8 బోగీలతో పరుగులు పెట్టనుంది. అన్నీ రిజర్వేషను బోగీలతో నడిచే ఈ రైలు ఉదయం 11గంటలకు (విశాఖవైపు), సాయంత్రం 4.38కి (సికింద్రాబాద్) రాజమండ్రి చేరుకుంటుంది. అలాగే సామర్లకోట ఉదయం 11.43గంటలకు, సాయంత్రం 4.03గంటలకు చేరుతుంది. వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోటలో ఆగుతుంది. అంతకు ముందు రాజమండ్రి రైల్వేస్టేషనులో ఏర్పాటుచేసిన వన్‌స్టేషన్- వన్‌ప్రొడక్టు స్టాల్‌ని ఉదయం 9.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జీఆర్పీ డీఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఇప్పటికే విశాఖ నుంచి సికింద్రాబాద్‌కి ఒక వందేభారత్ రైలు నడుస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ రంగనాథ్, ఏడీఈఎన్ గణేషన్, సీసీఐ కళ్యాణ్, సీటీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.

సామర్లకోటలో హాల్ట్ ఇవ్వడం అభినందనీయం: ఎంపీ

సామర్లకోట, మార్చి 12: రైల్వే చరిత్రలో అత్యంత వేగవంతమైన, సౌకర్యవంతమైన రైళ్లు వందేభారత్ రైళ్లు అని, అన్నివర్గాల ప్రజలకు ముఖ్యంగా విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య రాకపోకలు సాగించే వందే భారత్ రైలుకు సామర్లకోట స్టేషన్లో హాల్ట్ ఇవ్వడం అభినందనీయం అని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. సామర్లకోట రైల్వేస్టేషన్లో మంగళవారం వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ పేరిట రైల్వే ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన స్టాల్‌ను ఎంపీ గీతావిశ్వనాథ్ ప్రారంభించా రు. సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వందేభారత్ రైలు ట్రయల్ రన్‌గా సామర్లకోట మీదుగా విశాఖ వెళ్లనున్నదనే సమాచారాన్ని ఎస్ఎస్ రమేష్ ద్వారా తెలుసుకున్నారు. సామర్లకోట రైల్వేస్టేషన్లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేసేలా ఇప్పటికే కేంద్ర రైల్వే మంత్రితో పలు దఫాలు చర్చించినట్లు ఎంపీ గీతావిశ్వనాథ్ తెలిపారు. రైలు ప్రయాణీకు లకు నిరంతరం సేవలందించడంలోనూ సమాచారం అందివ్వడంలోనూ స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్ చేస్తున్న కృషిని అభినందిస్తూ ఎంపీ గీతావిశ్వనాథ్ రమేష్‌కు శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, బీజేపీ నాయకులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖకు రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం సామర్లకో టకు చేరుకున్న రైలుకు సామర్లకోట రైల్వే స్టేషన్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పెద్దాపురం ఇన్‌చార్జి తుమ్మల బాబు తదితర టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. నూతన రైలు ఇంజిన్‌వద్ద లాంచనంగా ఎమ్మెల్యే చినరాజప్ప కొబ్బరికాయకొట్టి రైలు ఎక్కి సందర్శించారు. రైలు లోకోపైలట్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి ఎమ్మెల్యే చినరాజప్ప అభినందించారు. సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, చీఫ్ కమ్మర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, నోడల్ అధికారి దేవేంద్రస్వామి, నిమ్మకాయల రంగనాగ్, సామర్లకోట బీజేపీ నాయకులు వందే భారత్ రైలును తిలకించారు.



సామర్లకోట స్టేషన్లో వన్‌స్టేసన్ వన్ ప్రొడక్ట్ షాపును ప్రారంభిస్తున్న ఎంపీ గీత



సామర్లకోటలో వందే భారత్ రైలుకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికల్లో..
రాయపూడి శ్రీనివాస్ ప్యానెల్ విజయం

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ గోదావరి డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికల్లో రాయపూడి శ్రీనివాస్(ప్రవీణ్ శ్రీను) ప్యానెల్ ఘన విజయం సాధించింది. చాంబర్ ఆఫ్ కామర్స్ కల్యాణ మండపంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించగా పోలైన 1200 ఓట్లలో శ్రీనివాస్ ప్యానెల్ అత్యధిక ఓట్లు సాధించిందని, ఈ కమిటీ 2024-2027 కాలానికి పదవిలో ఉంటుందని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలతో రాయపూడి ప్యానెల్

ఏజెన్సీ సమాచారం

అనుమతులు లేని ఆయుధాలు అప్పగించండి

● ఏఎస్పీ రాహుల్ మీనా



చింతూరు, మార్చి 12 : కలెక్టర్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఆయుధాలు కలిగి ఉండడం నేరమని అటువంటి ఆయుధాలు సంబంధిత పోలీసుస్టేషన్ల పరిధిలో వారంలోపు స్వచ్ఛందంగా అప్పగించాల్సిందిగా ఏఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. మంగళవారం ఏఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి నాటు తుపాకులు లేదా ఆయుధాలు కలిగి ఉన్నట్లైతే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. అనుమతులు లేని తుపాకులు ఎవరి వద్దనైనా ఉన్నట్లు సమాచారం ఉంటే అట్టి సమాచారాన్ని తమకు చేరవేయాల్సిందిగా ఏఎస్పీ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు వారికి బహుమతులు అందజేస్తామని ఏఎస్పీ తెలిపారు.

రాజవొమ్మంగి: మండలంలో ఎవరివద్దనైనా నాటుతుపాకులుగానీ, లైసెన్స్ లేని ఆయుధాలుగాని ఉంటే వారం రోజులలోపు పోలీసుస్టేషన్‌లలో స్వచ్ఛందంగా డిపాజిట్ చేయాలని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు కోరారు.

అడ్డతీగల: అడ్డతీగల, దుర్చర్తి, వై.రామవరం, గంగవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామ ప్రజలవద్ద నాటు తుపాకులు, అనుమతులు లేని ఆయుధాలు ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని సీఐ రవికుమార్ సూచించారు.

మోతుగూడెం: బొడ్డగండి పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో జంతువులను వేటాడే ఆయుధాలు ఎవరైనా కలిగి ఉంటే వాటిని వారం రోజుల్లోపు డొంకరాయి పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని, అలా అందజేయకపోతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

దేవీపట్నం: మండల పరిధిలో ఉన్న గ్రామాల్లో జంతువులను వేటాడే ఆయుధాలు ఎవరైనా కలిగి ఉంటే వాటిని వారం రోజుల్లోపు దేవీపట్నం పోలీస్ స్టేషన్‌కి అప్పగించాలని ఎస్ఐ కేవీ నాగార్జున తెలిపారు.

వై.రామవరం: మండలంలో ఎవరివద్దనైనా నాటు తుపాకులు కానీ, లైసెన్సు లేనటువంటి ఆయుధాలు కానీ ఉన్నట్లయితే వారం రోజుల్లో గుర్తేడు పోలీస్‌స్టేషన్‌లో పాజిట్ చేయాలని గుర్తేడు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

మారేడుమిల్లి: అక్రమంగా కలిగియున్న నాటు తుపాకులను తక్షణమే స్వచ్ఛందంగా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని మారేడుమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు ప్రకటనలో తెలిపారు.

తెల్లకార్డు లబ్ధిదారులకు రాగి పిండి

● చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు, మార్చి 12 : చింతూరు డివిజన్ పరిధిలో తెల్లకార్డుదారులు ఇక నుంచి రేషను బియ్యంతో పాటు రాగి పిండి కూడా పొందే అవకాశం ఉందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. రాగి పిండి కేజీ ఒక్కింటికి రూ.11 వంతున సరఫరా చేస్తామన్నారు. రాగి పిండితో బలవర్ధకమైన పోషకాలు పొందే అవకాశం ఉందన్నారు. రాగి పిండిలో ఎమినో యాసిడ్స్ ఉండడంతో ఏ వయస్సు వారైనా జావ రూపంలో తీసుకోవచ్చని పీవో తెలిపారు. ఈ సదుపాయాన్ని డివిజనులోని ప్రతి తెల్లకార్డు దారుడి సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పీవో కోరారు.

రాగులతో ఆరోగ్యం మెండు : సబ్‌కలెక్టర్

రంపచోడవరం, మార్చి 12: పౌష్టిక ఆహార లోపాలను నిర్మూలించేందుకు బలవర్ధక మైన పోషకాలు ఉండే రాగి పిండిని వినియోగించుకోవాలని సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్ అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మార్చి ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం రాగి పిండిని తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేస్తోందన్నారు. ప్రజలు ఆహారంతో పాటు రాగులు వినియోగించుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

ఇందుకూరులో టీడీపీ శంఖారావం



టీడీపీ ప్రచార కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

దేవీపట్నం, మార్చి 12: ఇందుకూరు పంచాయతీలో మంగళవారం టీడీపీ శంఖారావం, సూపర్‌సిక్స్ కార్యక్రమం జరిగింది. రంపచోడవరం టీడీపీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి ఆదేశాల మేరకు పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముచ్చు త్రిమూర్తులు, క్లస్టర్ ఇన్‌చార్జి మాగాపు బాబురావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలపై వివరించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెఎస్ నగేష్, గోళ్ళ చంటిబాబు, మచ్చు నాగేశ్వరావు, లంక హరిబాబు, కందికొండ గౌరీశ్వరి, కట్టుమూరి వీరబాబు, అయినవిల్లి భద్రం, కురసం వెంకన్నదొర, జొన్నల రాంబాబు, కారం పోసమ్మ, పల్లపాటి నాగేశ్వరరావు, యలగాడ నాగేశ్వరరావు, కర్రి రాజీవ్, పాతాళ పండు, పుట్టపల్లి మల్లేష్, మద్దేటి అంజిరెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

అడ్డతీగల, మార్చి12: వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని బాటసారుల సౌకర్యార్థం మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అడ్డతీగల ప్రధాన రహదారిపై బీజేపీ, జనసేన, టీడీపీ కార్యకర్తల సమక్షంలో ఆదివాసీ చైతన్యవేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. తొలిరోజు బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైటీసీలలో వివిధ కోర్సుల్లో శిక్షణ

రంపచోడవరం, మార్చి 12: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐటీడీఏ ఆధ్వర్యంలో మారేడుమిల్లి, రంపచోడవరం వైటీసీలలో వివిధ కోర్సులలో మూడు నెలల పాటు శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామని జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రంపచోడవరం వైటీసీలో బ్యూటీషియన్, మారేడుమిల్లి వైటీసీలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తారని, 35 సంవత్సరాలలోపు గిరిజన నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8333046514/ 9550004553 లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలి

● ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మి

రంపచోడవరం, మార్చి 12: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల లో ఆరోగ్యపరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఏరియా ఆసుపత్రిలో కిడ్నీ రోగులకు ఉచిత అపోలో డయాలసిస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డయాలసిస్ రోగులకు రక్తహీనత మెరుగు పరిచేందుకు ఇంజక్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. నెలకు 500మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలిసిస్ చేసే సామర్థ్యం ఉందని ఏజెన్సీ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.

సీఆర్పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్



వై.రామవరం, మార్చి12 : వై.రామవరం సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అంబుజియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అడ్డతీగల సీఐ రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక యూత్ నుంచి ఏడు టీమ్‌లను ఎంపిక చేశామని ఈనెల 14వరకు మూడు రోజులుపాటు టోర్నమెంట్ జరుగుతుందని ఇన్‌స్పెక్టర్ అంబుజియాన్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్, సామాజిక ఆసుపత్రి వైద్యులు చైతన్యకుమార్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో భారీ అన్న సమారాధన

రంపచోడవరం, మార్చి 12: స్థానిక ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయ కమిటీ, ఆలయ చైర్మన్ పీపీఎస్ భద్రరావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు లింగాల సీతారామంజనేయ స్వామి ఐదు రోజులపాటు పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు దొంతుకుర్తి వినయ్ సాయి శర్మ, చింతా పవన్ కుమార్ శర్మలను ఆలయ కమిటీ సన్మానించారు.

ఎన్నికల్లో మీడియా పాత్రపై శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 12: రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలని డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబా అన్నారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, మీడియా పాత్రపై కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమాచారం ప్రజలకు చేరవేయడంలో మీడియా బాధ్యత కీలకమని, ముఖ్యంగా చెల్లింపు వార్తలు రాసేటప్పుడు.. ఏ అభ్యర్థి కోసం వార్త రాసారో.. ఆ అభ్యర్థి వ్యయంలో చెల్లింపు వార్త విలువ జమ అవుతుందని గుర్తించుకోవాలన్నారు.

రాక్షస పాలనను తరిమేద్దాం

» జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

» టీడీపీలో చేరిన గోకవరం వైసీపీ నాయకులు

గోకవరం, మార్చి 12: రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న వైసీపీ రాక్షస పాలనను తరిమేద్దామని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరంలో వైసీపీకి చెందిన సుమారు 25 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనపై రాష్ట్ర ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. నిత్యం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయారన్నారు. ఇప్పటికే ఒక్కసారి జగన్‌కు ఓటేసినందుకే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరోమారు ఆయన గెలిస్తే రాష్ట్రం అధోగతిపాలు కావాల్సిందేనని ఎద్దేవా చేశారు. అనంతరం నెహ్రూ వైసీపీ నాయకులకు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.



గోకవరంలో టీడీపీలో చేరిన నాయకులతో జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట ఏఎంసీ చైర్మన్‌ను కలిసిన నవీన్

గోకవరం, మార్చి 12: వైసీపీ సీనియర్ నాయకుడు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు(బాబు) టీడీపీలో చేరనున్నారు. ఈ మేరకు ఆయన నుంచి సానుకూల సంకేతాలు వెలువడినట్టు సమాచారం. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మంగళవారం బాబు స్వగ్రామమైన గోకవరం మండలం కొత్తపల్లి వెళ్లి ఆయనను టీడీపీలోకి ఆహ్వానించారు. జగ్గంపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జ్యోతుల నెహ్రూకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఆయనను కోరారని, దీనికి బాబు కూడా సానుకూలంగా స్పందించినట్టు సమాచారం.

దినసరి కూలీల బతుకులు బాగుపడతాయి: వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12: టీడీపీ -జనసేన కూటమి అధికారంలోకి వస్తే దినసరి కూలీల బతుకులు బాగుపడతాయని రాజమహేంద్రవరం అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక దేవీచౌక్‌లో వివిధ పనుల కోసం ఎదురుచూసే దినసరి కూలీలను ఆయన కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో తమకు బాగుండేదని, చేతి నిండా పనులు ఉండేవని కానీ నాలుగేళ్లుగా పనులు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం వాసు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి దోచుకోవడం తప్ప కార్మికుల, కర్షకుల, కూలీల బతుకుదెరువుతో పనిలేదన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ఈ ఎన్నికల్లో గెలిపిస్తే కూలీలకు జీవితాల్లో వెలుగులు నింపుతామని, పనులు పుష్కలంగా ఉంటాయన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక దినసరి కూలీలు సేద దీరేందుకు శాశ్వతంగా ఒక భవనం నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నగర కార్యనిర్వాహక కార్యదర్శి ద్వారా పార్వతి సుందరి తదితరులు పాల్గొన్నారు.

పాలిక శ్రీను ఒక గురవింద గింజ: టీడీపీ నేతలు



రాజమహేంద్రవరంలో దినసరి కూలీలతో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

టీడీపీలో కార్పొరేటర్ నుంచి మొదలుకొని రాష్ట్ర చైర్మన్ పదవులు అనుభవించి పార్టీ నుంచి బయటకు గెంటివేయబడిన పాలిక శ్రీను ఒక గురవింద గింజలాంటి వాడని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవియాదవ్, తెలుగు యువత నగర అధ్యక్షుడు ఉర్లంకల లోకేష్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 10న రాజమహేంద్రవరంలో జరిగిన టీడీపీ ఎన్నికల శంఖారావం సభకు అశేష జనవాహిని వచ్చిందని, అదేరోజు ఎంపీ భరత్‌రామ్ పెట్టిన శెట్టిబలిజ ఆత్మీయసభకు జనాలు లేకపోవడంతో ఆ ఉక్రోషం ఆదిరెడ్డి కుటుంబంపై చూపిస్తూ పాలిక శ్రీను మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జనాలు రావాలంటే అభిమానం ఉండాలి గాని నగరంలో పడి చీరలు పంచితే రాదన్నారు. సమావేశంలో శెట్టి జగదీష్, లాలాఖాన్ (టిల్లు), కడలి రామకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

అనపర్తి, మార్చి 12: మండలంలోని రామవరంలో జరిగిన కార్యక్రమంలో బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన ఊలపల్లికి చెందిన వైసీపీ యువ నాయకులు సబ్బారపు వీరబాబు(నాని) తన మిత్రం బృందం 15మందితో కలిసి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బిక్కవోలు, ఊలపల్లి గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

» జిల్లా వైద్య సేవల సమన్వయాధికారిణి డాక్టర్ సనత్‌కుమారి



అనపర్తిలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సనత్‌కుమారి

అనపర్తి, మార్చి 12: ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు చక్కని వైద్య సేవలు అందిస్తున్నామని, గ్రామాల్లో పర్యటించే ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ సనత్‌కుమారి అన్నారు. మంగళవారం అనపర్తిలోని తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ కళావేదికలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యులు, సిబ్బందితో ప్రసవాలు, ప్రసూతి సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో నమోదైన గర్భిణుల వివరాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల సంఖ్యపై విడివిడిగా సమీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంటున్నాయని, వైద్యులు సేవలందిస్తున్నారని, ప్రసవాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొన్ని పీహెచ్‌సీల పరిధిలో సిబ్బంది వెనుకబడి ఉన్నారని వచ్చే సమావేశం నాటికి పరిస్థితిని మెరుగు పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, వైద్యులు వరలక్ష్మి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తప్పునకు ఉద్యోగులకు శిక్ష

» రెండు నెలల నుంచి జమ కాని జీతాలు

» డీఈవో కార్యాలయం వద్ద టీచర్ల నిరసన

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ డీడీవోగా వ్యవహరిస్తున్న పాఠశాలల టీచర్లకు రెండు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం నిరసనకు దిగారు. సాంకేతిక కారణాలను చూపిస్తూ జీతాలను జమ చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ధర్నా శిబిరం వద్ద యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమార్, అసోసియేట్ అధ్యక్షురాలు విజయగౌరి మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని ప్రైమరీ పాఠశాల టీచర్లకు జీతాలు అందలేదన్నారు. దీంతో 350 మంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్(డీఐఎస్) ఆఫ్ స్కూల్స్ హోదా పేరును ఎంఈవో-1గా మార్పు చేశారన్నారు. ఆ మేరకు డీఐఎస్ కోడ్‌లో ఉన్న ఉపాధ్యాయులు ఎంఈవో-1 డీడీవో కోడ్‌లోకి బదిలీ కావాల్సి ఉందన్నారు. అయితే, డీఐఎస్ నుంచి ఎంఈవో కోడ్‌కి బదిలీ కావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సీఎస్ఎంఎస్ ఆఫీస్, కమిషనరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. కానీ, సమన్వయం కొరవడడంతో రోజులు గడిచిపోతున్నాయని ఆరోపించారు. సీఎస్ఎంఎస్ కార్యాలయంలోని సిబ్బంది వారానికి ఐదు రోజులు అది కూడా సమయాలు పాటించకుండా విధులు నిర్వర్తించడం కూడా ఉద్యోగుల ఇబ్బందికి కారణమవుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లామని, ఆయన అధికారులను ఆదేశించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. దీంతో నెల క్రితమే ధర్నా నోటీసు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. స్థానికంగా డీఐఎస్ (ఎంఈవో-1) కూడా తమ పట్ల నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని టీచర్లు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు సానుకూలంగా స్పందించడంతో మంగళవారం సాయంత్రం ధర్నా విరమించామని.. రెండ్రోజుల్లో జీతాలు టీచర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోతే ఉద్యమిస్తామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు.



సమ్మె శిబిరం వద్ద యూటీఎఫ్ నాయకులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న

అధికారులపై చర్యలు తీసుకోండి

అనపర్తి ఎన్నికల అధికారికి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు

అనపర్తి, మార్చి 12: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న అధికారులపై, వారు పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న వారిపైనా చర్యలు చేపట్టాలని మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.మాధురికి టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిబంధనలకు విరుద్ధంగా నియోజకవర్గంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొంటున్నారని ఆయన వివరించారు. దీనిపై చర్యలు చేపట్టాలని ఆధారాలతో సహా ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మీడియాతో మాట్లాడుతూ ఇటీవల రంగంపేట మండలం నల్లమిల్లిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారని, అలాగే పందలపాకలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలంటూ ప్రచారం చేశారన్నారు. నియోజకవర్గంలోని మహిళలను ఆకర్షించేందుకు పంపిణీ చేసేందుకు చీరలను వలంటీర్లకు అందించారని దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, దత్తుడు శ్రీను, భాస్కరరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, సత్తి దేవదానరెడ్డి, నూతిక బాబూరావు, అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడతో ఉపాధి అవకాశాలు

మంత్రి అమర్‌నాథ్.. కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్క్‌కు భూమిపూజ



రాజానగరం, మార్చి 12: కలవచర్లలో పారిశ్రామికవాడ స్థాపనతో యువ తకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పరిశ్రమలు శాఖా మం త్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపా యాల కల్పనా సంస్థ జిల్లాలోని కలవచర్లలో 104 ఎకరాల్లో రూ.20.64 కోట్ల (ఎమ్మెస్ఈ సీడీపీ)నిధులతో నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్క్‌కు ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో కలిసి మంగళవారం ఆయన భూమి పూజ చేసి శిలాఫ లకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లా డుతూ నూతన పారిశ్రామికవాడలో 369 యూనిట్ల ద్వారా కనీసం 5 వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. పవన్‌కళ్యాణ్ టీడీపీతో పొత్తుకుని ఎన్ని సీట్లు పోటీచేస్తాడో, ఎన్ని సీట్లు త్యాగం చేస్తాడో తెలియని పరిస్థితి నెలకొంద న్నారు. పొత్తులో రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం నుంచి వెళ్లిపోవ డంతోనే రాజా విజయం ఖాయమైపోయిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకున్న ఏకైక నాయకుడు చంద్రబాబేనన్నారు. తొలుత వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను సాధ్యమైనంత వరకూ పరిష్కరించాలనే సంకల్పంతో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గూడూరి శ్రీనివాసరావు, దూలం పెద్ద, ఎంపీపీ గుర్రాల జోత్స్న, గంగిశెట్టి సోమేశ్వరరావు, కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, గండి నానిబాబు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ

సీతానగరం, మార్చి 12: ప్రపంచ గ్లకోమా నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బొబ్బిల్లంక పీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంటి శుక్లాలు వచ్చినప్పుడు సకాలంలో కేటరాక్ట్ ఆపరేషన్ చేయించుకోకుండా అశ్రద్ధ చేస్తే గ్లకోమా మారి శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య అధికారి సత్యప్రసాద్, ఎంపీహెచ్ఈవో వైసుబ్బారాయుడు, పంచాయతీ కార్యదర్శి రాజాక్, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రశాంతి, చాందిని, శైలజ, కీర్తి, మౌనిక, కృష్ణవేణి ఏఎన్ఎంలున, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భగవాన్ శ్రీరామకృష్ణుల జయంతి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12: రాజమహేంద్రవరం రామకృష్ణ మఠంలో భగవాన్ శ్రీరామకృష్ణుల జయంతి మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జపం, మంగళహారతి, సుప్రభాతం, వేద పఠనము, భజనలు, పూజ చేశారు. స్వామి శశికాంతానందజీ, స్వామి వేదవిద్యానందజీ మహరాజ్‌లు.. శ్రీరామకృష్ణుల బోధనలపై ప్రసంగించారు. ఈ సభలో స్వామి పరిజ్ఞేయానందజీ, స్వామి రఘువీరానందజీ, స్వామి సేవ్యానందజీ, స్వామి, ప్రజ్ఞానాథానందజీ, స్వామి అర్చానానందజీ మహరాజ్‌లు ప్రసంగించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు యూనిఫాం, షర్ట్స్, రేషన్ కిట్స్ పంపిణీ చేశారు.

డాక్టర్ కేశవస్వామి కన్నుమూత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12: రాజమహేంద్రవరంలో ప్రముఖ వైద్యులు నీశాజీయర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.కేశవస్వామి(84) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా ఒకరు మరణించారు. రాజమహేంద్రవరంలో ఆయన కొన్ని దశాబ్దాల పాటు సేవలందించారు. కేశవస్వామి మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పన్నులు చెల్లించాలి: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై వడ్డీ మాఫీ అయినందున ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఇంటి పన్నులు, ఖాళీ పన్నులు, నీటి చార్జీలను వెంటనే చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని కమిషనర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో పృథ్వీ ఎడిఫైస్ లిమిటెడ్ సంస్థ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన పన్నులు రూ.6.77 లక్షలను చెక్ రూపంలో సంస్థ ప్రతినిధులు కమిషనర్ దినేష్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బకాయిదారులు సకాలంలో పన్ను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమణ, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఆర్ఐ కేపీపీ మూర్తి, బిల్లు కలెక్టర్ గాంధీ పాల్గొన్నారు.

సీవీ రామన్ పరీక్షలో ఫాతిమాకు 3వ ర్యాంకు

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కి చెందిన సుచిర్ ఇండియా ఫౌండేషన్, సీవీ రామన్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్తంగా జనవరి 27న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు ప్రతిభా పరీక్షలో తమ ఆరో తరగతి విద్యార్థిని ఎస్‌కే ఐఫా ఫాతిమా రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించిందని శ్రీగౌతమి విద్యా సంస్థల కరస్పాండెంట్ సుంకర రవి తెలిపారు. ఏప్రిల్ 4న హైదరాబాద్‌లోని శ్రీ సత్యసాయి నగమగమం ట్రస్ట్‌లో నిర్వహించనున్న వేడుకల్లో ఫాతిమా రూ.2వేల నగదు బహుమతితో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందుకోనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫాతిమాను రవికుమార్, ప్రిన్సిపాల్, అకడమిక్ ఇన్‌చార్జులు తదితరులు అభినందించారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు మధు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం సీతంపేట రామాలయం వద్ద మంగళవారం యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మధు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకు డిమాండ్స్ ఏ ఒక్కటీ నెరవేరలేదని సమ్మెకాలం జీతం అమలు చేయలేదని, పెరిగిన జీతం కూడా పడలేదని అన్నారు. ఎన్నికలకు ముందు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్లను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. తమకు ఏ పార్టీ మేలు చేస్తుందో వారికే మున్సిపల్ కార్మికుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు రమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

సహోద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో ఓ పోలీసు కానిస్టేబుల్ మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని జిల్లాలోని పోలీసులు ఆదుకున్నారు. ఆర్థిక సాయం అందించారు. కానిస్టేబుల్ వీబీ జయదేవ్ (పీసీ 3694) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్ వారి కోసం మొత్తం రూ.3 లక్షలు సేకరించారు. వాటిని ఎస్పీ జగదీశ్ మంగళవారం జయదేవ్ కుమార్తె, భార్యకు అందజేశారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దివాన్‌చెరువు, మార్చి 12: సమయం ఎంతో విలువైనదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు సహాయాచార్య తలారి వాసు కోరారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు సేవా ఉగాది, శ్రీమహాగణపతి యువజన సేవాసమితి వ్యక్తిత్వ వికాస సదస్సును మంగళవారం నిర్వహించింది. హెచ్ఎం లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వాసు మాట్లాడుతూ పదో తరగతి తర్వాత సమున్నతమైన విద్యల వైపు వెళ్లడానికి, విలువలు గల వ్యక్తులుగా మనగలగడానికి సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శర్మ, సేవా ఉగాది తరపున నీలపాల శ్రీనివాస్, గ్రంధి గణేష్, శ్రీను, బబ్లు పాల్గొన్నారు.

పిరమిడ్ ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

బిక్కవోలు, మార్చి: కొంకుదురులోని శ్రీశివరామకృష్ణ పిరమిడ్ ధ్యాన కేంద్ర వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్ నల్లమిల్లి అనపూర్ణ భగవద్గీతలోని శ్లోకాలను అర్థాలతో సహా వివరించారు. అనంతరం దివంగత గొలుగూరి భాస్కరరెడ్డి, సుశీల దంపతుల కుటుంబ సభ్యులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.

బిక్కవోలు రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

బిక్కవోలు, మార్చి 12: బిక్కవోలు రైల్వే స్టేషన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రూ.2.5 కోట్లతో చేపట్టే గూడ్స్‌షెడ్, హమాలీలకు వసతులు, తాగునీరు, అప్రోచ్ రోడ్ వంటి పనులకు, గతిశక్తి కార్యక్రమంలో భాగంగా రూ.15 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే గూడ్స్ స్లీపర్ మాటింగ్ రోడ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరామకృష్ణంరాజు, జొన్నల పవన్‌కుమార్, కాకి సత్యనారాయణ, యామన దుర్గారావు, రైల్వే ఏడీఎంఈ రాజేష్, సీజీఎస్ ఆలీ, సీసీఐ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్‌జల్ మిత్రలకు అవగాహన సదస్సు

ధవళేశ్వరం, మార్చి 12: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్‌లో భాగంగా హర్ ఘర్ జల్ (ఇంటింటికి తాగునీరు అందించండి)కార్యక్రమానికి ఎంపిక చేసిన నల్‌జల్ మిత్రలను నైపుణ్యవంతులుగా తయారు చేయడానికి మంగళవారం బొమ్మూరులోని నాక్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి జిల్లా వ్యాప్తంగా ఉన్న జల సంఘాల నుంచి 35 మంది మహిళా ప్రతినిధులు హాజరైనట్టు నాక్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ జె.రాజు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నాక్ జోనల్ అధికారి మురళీధర్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు, మాస్టర్ ట్రైనర్ ఎం.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు

రాజానగరం, మార్చి 12: మండలంలోని కానవరంలో వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీరామకృష్ణ మంగళవారం జనసేన పార్టీలో చేశారు. ఆయనను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీరామకృష్ణతో పాటు గ్రామానికి చెందిన సంగీత మూర్తి, బొర్రా సీతారామ్, యర్రంశెట్టి సత్తిబాబు, పిల్లా శ్రీను, బొర్రా శ్రీను, మణికంఠ, శివ, నాగవరపు భాస్కరరావు తదితరులు వైసీపీని వీడి జనసేనలో చేరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళ) సా.6.21
సహరి(బుధ) ఉ.4.52

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను
తప్పక పాటించాలి
కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ
8లో



ఘన స్వాగతం

- భారీ ర్యాలీతో నిడదవోలుకు వచ్చిన కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్
- బ్రహ్మరథం పట్టిన నాయకులు, కార్యకర్తలు



కోటసత్తెమ్మ ఆలయంలో కందుల దుర్గేష్, భోగవల్లి

నిడదవోలు, మార్చి 12: నిడదవోలు నియోజకవర్గ జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్‌కు నిడదవోలులో ఘన స్వాగతం లభించింది. భారీ ర్యాలీని వందలాది మంది అనుసరించారు. రాజమహేంద్రవరం నివాసం నుంచి మంగళవారం ఉదయం దుర్గేష్ నిడదవోలుకు బయలుదేరారు. విజ్జేశ్వరం వద్ద జన సైనికులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా విజ్జేశ్వరం శివాలయంలోను, గోపవరం గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయంలోను, నిడదవోలులోని నంగాలమ్మ అమ్మవారి గుడిలోను, తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానులను ఉద్దేశించి దుర్గేష్ మాట్లాడుతూ జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళతానని చెప్పారు. నిడదవోలు నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటానని చెప్పారు. తొలిసారి నిడదవోలులో అడుగుపెట్టగానే అభిమానులు చూపిన ఆదరణ మరువలేనిదని అన్నారు. త్వరలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆయన చెప్పారు. నిడదవోలు అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మరో రెండు రోజుల్లో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ పెద్దలను స్వయంగా కలిసి మద్దతు కోరతానని చెప్పారు. ఆయన వెంట నిడదవోలు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగవల్లి ప్రసాద్, నిడదవోలు పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, మండల అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, అడ్డగర్ల వెంకటకృష్ణ, జనసేన రాష్ట్ర కార్యదర్శులు గంటా స్వరూప, ప్రియాసౌజన్య, నిడదవోలు పట్టణ మండల, ఉండ్రాజవరం, పెరవలి మండలాల జనసేన, తెలుగుదేశం పార్టీ, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం, మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఓటు నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. రాజానగరం మండలం తూర్పు గోనగూడెంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జగదీశ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కమిషన్ 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేలా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక స్వీప్ కార్యకలాపాలను చేపట్టాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఒక్క ఓటరు తప్పకుండా పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథ్, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ హాల్ టికెట్లు

విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకాయిలకు హాల్ టిక్కెట్‌కు లంకె పెట్టి పదో తరగతి విద్యార్థులను పలు ప్రైవేటు పాఠశాలలు ఇబ్బందులకు గురి చేస్తుండడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'టెన్షన్ పెట్టేస్తున్నారు' కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. హాల్ టికెట్ తీసుకోవడంలో విద్యార్థులకు ఊరట కలిగించే చర్యలు తీసుకున్నారు. పదో తరగతి హాల్ టికెట్లను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచామని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైటు నుంచి హాల్‌టికెట్‌ని డౌన్‌లోడ్ చేసుకొని తీసుకున్న ప్రింట్‌తో నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆ హాల్ టికెట్లను కూడా అనుమతించాలని జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లోని ప్రధాన పర్యవేక్షకులు, శాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్‌ను తీసుకొచ్చిన విద్యార్థులను పరీక్షకు తిరస్కరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని డీఎస్ఈవో చెప్పారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు.



2 ఎక్స్‌ప్రెస్‌లకు కొవ్వూరులో హాల్ట్

కొవ్వూరు, మార్చి 12: కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి కొత్తగా రెండు రైళ్లకు ప్రయోగాత్మక పరిశీలన కోసం హాల్ట్ కల్పిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 17479-17480 తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్, 17481-17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు బుధవారం నుంచి కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో ఆగనున్నాయి. 17480 తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ రాత్రి 10-05 గంటలకు, 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9-02 గంటలకు కొవ్వూరు చేరుకుంటుంది. అలాగే 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9-02 గంటలకు, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10-05 గంటలకు కొవ్వూరు చేరుకుంటుంది. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు కోరుతున్నారు.



సీట్లు.. సర్దుబాట్లు

- అభ్యర్థుల ఎంపిక తుది కసరత్తులో కూటమి పార్టీలు
- గోపాలపురం, కొవ్వూరు నేతలతో చంద్రబాబు సమీక్ష
- అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేసిన నాయకులు
- వైసీపీలో మాత్రం సమన్వయకర్తల్లో గుబులు


(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి):

ఈ వారంలోనే ఎన్నికల షెడ్యూల్ రానున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాజకీయ పార్టీలతో పాటు అధికార వర్గాలలో కూడా ఈ ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేసింది. మరో పక్క రాజకీయ పార్టీలు కూడా సీట్ల కేటాయింపుపై కసరత్తును దాదాపు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు రోజుల క్రితం టీడీపీ-జనసేనతో బీజేపీ కూడా జత కట్టింది. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీన ఈ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో ఒక్కొక్కటీ క్లియర్

ఇప్పటికే టీడీపీ తొలి జాబితాలో రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించగా, జనసేన రాజా నగరం అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణను ప్రకటించిన సంగతి తెలిసిందే. తొలి జాబితాలో ప్రకటించకపోయినా తర్వాత రాజమహేంద్రవరం రూరల్ విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి, జనసేన నేత కందుల దుర్గేష్ మధ్య కాస్త టెన్షన్ ఏర్పడిన సంగతి తెలిసిందే. తర్వాత పరిణామాలలో కందుల దుర్గేష్‌ను నిడదవోలు ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించగా, రూరల్ నియోజకవర్గ సమస్య పరిష్కారం అయింది. గోరంట్లకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఇప్పటికే ఎన్నికల ప్రచార ఏర్పాట్లన్నీ ముమ్మరం చేశారు. ఇక పేరు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. నిడదవోలులో కందుల దుర్గేష్ మంగళవారం ప్రచారం కూడా మొదలు పెట్టారు. దీంతో టీడీపీ మూడు, జనసేనకు రెండు స్థానాలు క్లియర్ అయ్యాయి.

గోపాలపురం, కొవ్వూరుపై బాబు సమీక్ష



గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల పార్టీ ముఖ్యులతో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గోపాలపురం టీడీపీ అభ్యర్థి విషయంలో చాలా కాలం నుంచి అక్కడ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు పేరు వినబడుతోంది. కానీ అక్కడ జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజుతో విభేదాల వల్ల ఇంతవరకూ అధికారికంగా ప్రకటించలేదు. బాపిరాజు మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజుకు, ముళ్లపూడి బాపిరాజుకు మధ్య గ్యాప్ ఉంది. ఈ నేపథ్యంలో గోపాలపురంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులను, ముళ్లపూడి బాపిరాజు, ఇద్దరు స్టేట్ కమిటీ సభ్యులను కూడా పిలిచి టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం స్వయంగా మాట్లాడారు. మొదట మండల పార్టీల అధ్యక్షులు, స్టేట్ కమిటీ సభ్యులతో మాట్లాడినట్టు తెలిసింది. తర్వాత ముళ్లపూడి బాపిరాజు ఒక్కరితోనే మాట్లాడినట్టు సమాచారం. ఇక కొవ్వూరు అభ్యర్థి ఖరారు విషయంలో కొవ్వూరులో పార్టీ పెద్ద పెండ్యాల అచ్చిబాబుతో సమీక్షించారు. ఆయనతో పాటు ద్విసభ్య కమిటీ సభ్యులు కె.రామకృష్ణ, జొన్నలగడ్డ చౌదరి కూడా హాజరయ్యారు. ఏం చర్చించారనేది బయటకు రాలేదు. కానీ అభ్యర్థిని ఖరారు చేసే విషయంలో నిర్ణయాధికారం అధిష్ఠానానికి అప్పగించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ స్థానాలలో అభ్యర్థుల విషయంలో చంద్రబాబు స్పష్టమైన వైఖరితో ఉన్నట్టు సమాచారం. వారి పేర్లు అతి త్వరలో ప్రకటించనున్నట్టు పార్టీ వర్గాల నుంచి వస్తున్న సమాచారం. బీజేపీతో పొత్తు వల్ల రాజమహేంద్రవరం లోక్‌సభను తమకు కేటాయించాలని బీజేపీ అడుగుతున్నట్లు తెలిసింది. ఇది అధికారికంగా ప్రకటిస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పేరు కూడా ఎల్లుండే ప్రకటించే అవకాశం ఉంది.



ఏ క్షణాన ఏం జరుగుతుందో..!

వైసీపీ సమన్వయకర్తల గుండెల్లో రైళ్లు

వైసీపీ ఇప్పటికే నాలుగు అసెంబ్లీ స్థానాలకు, పార్లమెంట్ స్థానానికి సమన్వయ కర్తలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇంకా అనపర్తి, రాజానగరం, నిడదవోలు నియోజకవర్గ సమన్వయ కర్తలను ప్రకటించాల్సి ఉంది. కానీ వారు ఇప్పటికే నియోజకవర్గాలలో పనిచేసుకుంటున్నారు. కానీ వైసీపీ అధిష్ఠానం నేరుగా అభ్యర్థులను ప్రకటించకుండా, సమన్వయకర్తల పేరుతో ప్రకటించడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ప్రకటించిన వారితో పాటు, ప్రకటించని వారిలో కూడా చివరి వరకూ ఏమవుతుందోననే ఆందోళన ఉంది..

అనపర్తి ఆస్పత్రిలో ఆహారం తినలేం..!



అరకొరగా..అదీ నాసిరకం భోజనం



కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం ఇదే..

అనపర్తి, మార్చి 12 : అనపర్తి ఏరియా ఆసుపత్రిలో సదుపాయాలు మాట అటుంచితే ఇక్కడ రోగులకు అందించే ఆహారం అధ్వానంగా ఉంటోంది. మెనూ ప్రకారం కాకుండా అరకొరగా పంపిణీ చేస్తున్నారని అదీ నాసిరకం భోజనంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అల్పాహారం, భోజనం అందించేందుకు రాష్ట్రంలో ఒక సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. అయితే ఆ కాంట్రాక్టరు ఎక్కడికక్కడ సబ్ కాంట్రాక్టులు ఇవ్వడంతో ఇక్కడ స్థానికంగా ఉండే రెస్టారెంటు యజమాని ఆసుపత్రిలో రోగులకు భోజనం సరఫరా చేస్తున్నాడు. రోజు వారి రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం అందించాల్సి ఉండగా ఇక్కడ మాత్రం సబ్ కాంట్రాక్టరు ఒక్క మధ్యాహ్నం పూట మాత్రమే భోజనం సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇదంతా ఎప్పటి నుంచో జరుగుతున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. గత కొద్దికాలంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా ఉన్న బాల భోజనం క్వాలిటీ, క్వాంటిటీపై సరఫరా దారుడితో గొడవపడుతూ వస్తున్నాడు. రెండు రోజుల క్రితం వీరిద్దరి మధ్య వివాదం పెద్దది కావడంతో విషయం వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న మీడియా అక్కడికి వెళ్లగా పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. కేవలం ఒక్క పూట మాత్రమే రోగులకు భోజనం అందించడం అదీ రైస్ సరిపడ ఇవ్వకపోవడం, సాంబారు, పెరుగు నోటిలో పెట్టుకునే విధంగా లేకపోవడంతో రోగులు తమకు ఇచ్చిన భోజన పొట్లాలను చెత్తకుప్పలో పడేస్తున్నారు. ఒక వైపు సబ్ కాంట్రాక్టు ద్వారా భోజనాలు సరఫరా చేసే వ్యక్తి, మరో పక్క ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఇద్దరూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కావలసిన వారు కావడంతో తప్పు ఒప్పులను చెప్పేందుకు ఎమ్మెల్యే కూడా ఒకింత వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రి వైద్యులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ దీనిపై ఎమ్మెల్యే దృష్టి సారించినట్లు కనబడటం లేదు. ఏది ఏమైనా రోగంతో ఆసుపత్రికి వచ్చిన పేదలకు అందించే భోజనంలో రాజీ పడకూడదని పరిస్థితులపై ఆరా తీసి రోగులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దళితులే జగన్‌ను దించేస్తున్నారు..

- శవ రాజకీయాలు చేసే నీచ సంస్కృతి జగన్‌ది..
- దళితుల అభ్యున్నతి టీడీపీతోనే
- దళిత శంఖారావంలో మహాసేన రాజేష్



దళిత శంఖారావం సభలో రాజేష్‌ను బుచ్చయ్యచౌదరి సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు



దళిత శంఖారావంలో మాట్లాడుతున్న మహాసేన రాజేష్

రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ మార్చి 12: ఓట్లు వేసి అధికారంలోకి తీసుకువచ్చిన దళితులపై నాలుగేళ్ల 11 నెలల పాలనలో అనేక దాడులు చేయించిన జగన్‌ను తిరిగి ఆ దళితులే దించేయడానికి రెడీగా ఉన్నారని, జగన్‌కు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేసేందుకు సిద్ధమయ్యారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బీఆర్‌కేలో మంగళవారం టీడీపీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఆర్.ఆంటోని అధ్యక్షతన టీడీపీ-జనసేన దళిత శంఖారావం సమావేశం జరిగింది. టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ మాట్లాడుతూ ఒక దళితుడిని చంపిన వాడిని జగన్‌రెడ్డి పక్కన పెట్టుకుని తిరుగుతున్నాడన్నారు. దళితులకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వలేదన్నారు. దళితులపై ఇన్ని అరాచకాలు చేసిన జగన్‌రెడ్డీ. కాస్కో... దళితుల సత్తా ఏంటో ఈ ఎన్నికల్లో చూపించబోతున్నాం..అని రాజేష్ అన్నారు. 'తండ్రి శవాన్ని పార్టీకి వాడుకున్నావు.. బాబాయి శవాన్ని వాడుకుని అధికారంలోకి వచ్చావు. ఇప్పుడు ఒక అమ్మాయి చనిపోతే టీడీపీ, జనసేన కారణమని ట్రోల్ చేస్తూ ఈ సంఘటనను కూడా ప్రచారానికి వాడుకుంటున్నావా జగన్ రెడ్డి' అని అన్నారు. శవాలను రాజకీయంగా వాడుకునే నీచ సంస్కృతి జగన్‌దని మండిపడ్డారు. దళితుల సంక్షేమం చంద్రబాబు పవన్ కల్యాణ్ వల్లే సాధ్యమవుతుందన్నారు. ప్రతి దళితుడు ఆలోచించుకోవాలని ఒక్కొక్కరు వంద మందితో కూటమికి ఓటు వేయించాలన్నారు. ఒక దళితుడిని అత్యున్నత లోక్‌సభలో స్పీకర్ పదవిలో కూర్చోపెట్టిన చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజమహేంద్రవరం రూరల్ బుచ్చయ్యచౌదరి అడ్డా అని ఆయనతో పెట్టుకునే సత్తా ఎవరికీ లేదన్నారు. గోరంట్ల మళ్లీ విజయం సాధించడం ఖాయమన్నారు. రాజమండ్రిలో తనపై ఎక్కడ ఎటాక్ జరిగిందో అదే ప్రాంతంలో బుచ్చన్న విజయోత్సవ ర్యాలీ చేస్తానన్నారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక దళితులను దారుణంగా దగా చేశాడన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేశాడని, ఉద్యోగాలు, ఉపాధి లేదన్నారు. దళితుల సంక్షేమానికి చంద్రబాబు అమలు చేసిన 27 పథకాలను జగన్ రద్దు చేసి ద్రోహం చేశాడన్నారు. రూ.35 వేల కోట్లు దారి మళ్లించారని చెప్పారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పొట్టన పెట్టుకున్నాడన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్య పథకంతో వేలాది మంది విద్యార్థులకు విదేశీ విద్యను చేరువ చేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1539 ఇన్నోవా కార్లు, 7500 బొలెరో వాహనాలు, 5 వేల ఆటోలు, 500 ట్రాక్టర్లు, 200 జేసీబీలు ఇచ్చి వారి జీవనోపాధికి బాటలు వేశారని గుర్తు చేశారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావాలని తాను మళ్లీ ఎమ్మెల్యే కాగానే రూరల్‌లో 10 వేల ఇళ్లు నిర్మించి అర్హులైన ప్రతిఒక్కరికి ఇంటిని ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. దళితుల శ్మశాన వాటికలను పరిరక్షించి అభివృద్ధి చేస్తామన్నారు. కేఎస్ జవహర్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో దళితులను అన్నివిధాల ఆదుకుని అభివృద్ధి చేసింది చంద్రబాబేనని అన్నారు. జగన్ రాష్ట్రంలో దళితులను దారుణంగా మోసం చేశారన్నారు. దళితులంతా నిర్ణయించుకున్నారని జగన్‌ను దించేస్తారన్నారు. గన్నికృష్ణ మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని చెప్పారు. దళితులు బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. గోరంట్లను మంత్రిగా చూడాలన్నారు. అనంతరం దళిత నేతలు గోరంట్లను సత్కరించారు. టీడీపీ నాయకులు నున్న కృష్ణ, తలారి మూర్తి, రొంపిచర్ల ఆంటోని, యార్లగడ్డ శేఖర్, జల్లి కృపానంద్, శీలం రవికుమార్, బోలా జాన్, కాయల సత్యనారాయణ, ముత్తాబత్తుల విజయమ్మ, చింతపర్తి నాగేశ్వరరావు, మందపల్లి రత్నరాజు, రాయిడి సునీత, ముత్యం సురేష్, కె.బుల్లియ్య పల్లి ప్రసాద్, కె.రత్నకుమారి, బి.హేమలత, నేతల పాపారావు, సాయి, చింతపర్తి నాగేశ్వరరావు, చింతపర్తి సావిత్రి తదితరులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సభకు హాజరైన దళితులు, నేతలు



మాట్లాడుతున్న జవహర్

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

చంద్రబాబును కలిసిన కొవ్వూరు ద్విసభ్య కమిటీ



కొవ్వూరు, మార్చి 12: టీడీపీ అధినేత చంద్రబాబును పార్టీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న సార్వత్రిక ఎన్నికలు, పార్టీ సంబంధిత విషయాలు, కార్యక్రమాలపై చర్చించినట్టు వారు తెలిపారు. పార్టీ నిర్ణయం ఏదైనా అభ్యర్థి విజయానికి కృషి చేయాలని చంద్రబాబు సూచించారన్నారు.

ఉచిత డయాబెటిక్ రెటినోపతి వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, మార్చి 12: రోటరీ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మంగళవారం నిడదవోలులోని బీసీ కమ్యూనిటీ హాలులో రాజేశ్వరి రామకృష్ణన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత డయాబెటిక్ రెటినోపతి నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఉజ్జిన జవహర్‌లాల్ నెహ్రూ ఆర్థిక సహకారంతో నిర్వ హించిన ఈ శిబిరంలో 83 మందికి రెటినోపతి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు మందులు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో శివకుమార్, కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, చిక్కాల రాజా, బోజ్జా పాపారావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం



శ్రామిక మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

కొవ్వూరు, మార్చి 12: పితృస్వామ్య పరిపాలనలో పురుషాధిక్య భావజాలంతో మహిళలు తీవ్రమైన భయంతో బతుకుతున్నారని పీవోడబ్ల్యు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక అన్నారు. కొవ్వూరు రాజరాజేశ్వరి నగర్‌లో ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యు) ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం నిర్వహించారు. మల్లిక మాట్లాడుతూ మహిళలను చిన్నచూపు చూస్తూ అవమానకరంగా దాడులు, హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ప్రకారం మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం ఇంకా రాలేదన్నారు. చట్టాలు కాగితాలకే పరిమితమై మహిళల హక్కులు నీరుగారిపోతున్నాయన్నారు. జనాబాలో సగంగా ఉన్న మహిళలకు అన్నింటిలో సమాన భాగస్వామ్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సాయిపుష్ప, మనీకుమారి, రమా, హేమ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

తాళ్లపూడి, మార్చి 12: మండలంలోని గజ్జరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు అల్పాహారం అందించారు. అనంతరం ఆయన పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలో, ఎలా రాయాలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్, నందన ఫౌండేషన్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి



నల్లజర్లలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నల్లజర్ల/పెరవలి, మార్చి 12: ప్రతి పౌరుడు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని నల్లజర్ల, దూబచర్ల, ఘంటావారిగూడెం, జగన్నాథపురం గ్రామాల్లో కేంద్ర బలగాలతో నిర్వహించిన కవాతును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని, ప్రజల్లో భయాందోళనలు లేకుండా ఓటు హక్కు వినియోగించుకోనేలా నమ్మకం కలిగించేందుకు ఈ కవాతు నిర్వహించామన్నారు. కవాతులో ఎస్ఐ టీవీ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెరవలి మండలంలోని పిట్టల వేమవరం, కడింపాడు, మల్లేశ్వరం, అన్నవరప్పాడు ఖండవల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. సీఐ కె.వెంకటేశ్వరరావు ఆదేశాలు మేరకు ఎస్ఐ మూర్తి సుమారు 60 మంది సీఆర్‌పీఎస్ జవాన్లు, స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి కవాతు జరిపారు.

బాలల పరిరక్షణకు కృషి చేయాలి

నల్లజర్ల, మార్చి 12: బాలల పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం పీవోఎస్ఐసీజీ క్రాంతిలాల్ అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్లజర్లలో స్వయం సహాయక సంఘ మహిళలకు బాలల సంరక్షణపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలపై జరుగుతున్న శారీరక, మానసిక, లైంగిక, వేధింపులు, పోక్సో చట్టం-2012పై అవగాహన ఉండాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, మహిళల అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్‌లు పరిశీలిస్తున్న దేవరపల్లి సీఐ బాలసురేష్‌బాబు, స్థానిక ఎస్ఐ సతీష్‌కుమార్

గోపాలపురం, మార్చి 12: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను దేవరపల్లి సీఐ కె.బాల సురేష్ బాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద గస్తీ కాస్తున్న పోలీస్‌సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఉన్నారు.

రైతులకు రుణాల అందజేత



పెరవలి, మార్చి 12: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా జిల్లా డీఆర్‌డీఏ పీడీ మూర్తి, పశుసంవర్ధక శాఖ జేడీ రాధాకృష్ణ ఇంటింటికీ వెళ్లి కానూరు, కానూరు అగ్రహారంలో రైతులతో సమావేశం నిర్వహించారు. అక్కడ ఎంపిక చేసిన రైతులు 45మందికి పశువులకు కొనుగోలు చేసేందుకు, వాటికి దాణా కొనుగోలు చేసేందుకు రుణాలు అందజేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని పాలు అమ్మడం ద్వారా ఆదాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హిమ మహేశ్వరి, పశువైద్యుడు డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్రపై శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 12: రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలని డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబా అన్నారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, మీడియా పాత్రపై కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమాచారం ప్రజలకు చేరవేయడంలో మీడియా బాధ్యత కీలకమని, ముఖ్యంగా చెల్లింపు వార్తలు రాసేటప్పుడు.. ఏ అభ్యర్థి కోసం వార్త రాసారో.. ఆ అభ్యర్థి వ్యయంలో చెల్లింపు వార్త విలువ జమ అవుతుందని గుర్తించుకోవాలన్నారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

- సందేహాల నివృత్తికి ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్
- అభ్యర్థుల ప్రచారాలకు అనుమతులు తీసుకోవాలి
- కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, మార్చి 12: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ అందించిన మార్గదర్శకాలను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని కొవ్వూరు సబ్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఆచరించవలసిన విధి విధానాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై సందేహాలుంటే నివృత్తి చేసేందుకు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నామినేషన్ల అనంతరం నుంచి ఈవీఎంలను నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటుచేసిన తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిస్తామన్నారు. అభ్యర్థులు తమ ప్రచారాలకు ముందుగా అనుమతులు తీసుకోవాలని, వారి ఆస్తులపై ఎలాంటి ప్రచార అంశాలు ఉండకూడదన్నారు. రాజకీయ పార్టీలు చేసే ఫిర్యాదులపై రాతపూర్వకంగా వివరాలు అందజేస్తామని సబ్‌కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎలక్టోరల్ రోల్, పోలింగ్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, పార్టీల విధులు, బాధ్యతలు, నామినేషన్లు, ప్రవర్తనా నియమావళి, పోలింగ్ ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్ద పోలింగ్, వ్యయ పర్యవేక్షణ, పోలింగ్ సామగ్రి తరలింపు, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లపై అవగాహన కల్పించారు. ఎంపీ అభ్యర్థి రూ.90 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు వ్యయం మించి ఖర్చు చేయరాదన్నారు. అభ్యర్థుల ఖర్చులపై ఎన్నికల అధికారులు షాడో రిజిష్టర్లను నిర్వహిస్తారన్నారు. నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచి ప్రచారానికి అవసరమైన అనుమతులు సువిధ యాప్‌లో అప్లోడ్ చేసి అనుమతులు పొందాలన్నారు. సోషల్ మీడియాలో ప్రచారం చేసుకునే అభ్యర్థులు ఎంసీఎంసీ ద్వారా అనుమతి పొందాలన్నారు. ఇతర నేతలను విమర్శించే, కుల,మత పరంగా దాడులను ప్రోత్సహించే ప్రకటనలు, అసభ్యకరంగా, పరువు భంగం కలిగించే, హింసను ప్రేరేపించే విధంగా, న్యాయ వ్యవస్థ ధిక్కారం కింద వచ్చే విధంగా ప్రకటనలు చేయరాదన్నారు. సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ కలిసికట్టుగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

రాత్రి ఒప్పు.. పగలు తప్పు

- అధికలోడ్ తరలిస్తున్న ఇసుక లారీపై కేసు
- డ్రైవర్‌ను రాత్రి వదిలిపెట్టి, పగలు అదుపులోకి తీసుకున్న ఎస్ఈబీ అధికారులు



కొవ్వూరులో ఓవర్‌లోడ్‌తో ఉన్న ఇసుక లారీ

కొవ్వూరు, మార్చి 12: రాత్రి ఒప్పయ్యింది పగలు తప్పయింది. ఇదీ కొవ్వూరు ఎస్ఈబీ అధికారుల పని తీరు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 11వ తేదీ రాత్రి కొవ్వూరు మండలం చిడిపి వద్ద ఇసుకర్యాంపులో ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. రెండు లారీలను అదుపులోకి తీసుకుని పత్రాలు చూపించమంటే డ్రైవర్ల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో, కాటాకు తీసుకువెళ్లి బరువు వేయించి అధికలోడ్ ఉండడంతో లారీలను కొవ్వూరు ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించారు. దారిలో ఏమైందో ఏమో లారీల పత్రాలు సరిగ్గా ఉన్నాయని, లారీలను వదిలిపెట్టారు. మార్గమధ్యలో బస్టాండ్ సెంటర్ చేరుకునే సరికి గూడ్స్‌ఆటో స్టాండ్ సమీపంలో ఉన్న కల్వర్ట్ పైనుంచి లారీ వెళ్లడంతో కల్వర్టు దెబ్బతినడంతో పాటు లారీ టైర్ పంక్చర్ అవ్వడంతో ఆర్టీసీ డిపో ఎదురుగా లారీని నిలుపుదల చేశారు. వెనుక వస్తున్న లారీ వెళ్లిపోయింది. ఉదయం అటుగా వెళ్తున్న కొవ్వూరు సీఐ.. ఓవర్‌లోడ్ లారీని రోడ్డు మధ్యలో ఎందుకు నిలుపుదల చేశారని ప్రశ్నించగా అధికలోడ్‌తో లారీ రావడంతో కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నదని, మరమ్మతులు చేయించాలన్నారు. డ్రైవర్ రాత్రి జరిగిన సంఘటనను వివరించగా లారీకి టైర్ పంక్చర్ వేయించుకుని లారీని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావాలని ఆదేశించారు. విషయం అందరికి తెలిసిపోతుందని గ్రహించిన ఎస్ఈబీ సీఐ.. సిబ్బందితో లారీ వద్దకు చేరుకుని టైర్ పంక్చర్ వేయించుకుంటున్న డ్రైవరును అదుపులోకి తీసుకుని ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించారు.

అధికారుల తప్పునకు ఉద్యోగులకు శిక్ష

- రెండు నెలల నుంచి జమ కాని జీతాలు
- డీఈవో కార్యాలయం వద్ద టీచర్ల నిరసన



సమ్మె శిబిరం వద్ద యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ డీడీవోగా వ్యవహరిస్తున్న పాఠశాలల టీచర్లకు రెండు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం నిరసనకు దిగారు. సాంకేతిక కారణాలను చూపిస్తూ జీతాలను జమ చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ధర్నా శిబిరం వద్ద యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమార్, అసోసియేట్ అధ్యక్షురాలు విజయగౌరి మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని ప్రైమరీ పాఠశాల టీచర్లకు జీతాలు అందలేదన్నారు. దీంతో 350 మంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిప్యూటీ ఇన్స్‌పెక్టర్(డీఐఎస్) ఆఫ్ స్కూల్స్ హోదా పేరును ఎంఈవో-1గా మార్పు చేశారన్నారు. ఆ మేరకు డీఐఎస్ కోడ్‌లో ఉన్న ఉపాధ్యాయులు ఎంఈవో-1 డీడీవో కోడ్‌లోకి బదిలీ కావాల్సి ఉందన్నారు. అయితే, డీఐఎస్ నుంచి ఎంఈవో కోడ్‌కి బదిలీ కావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సీఎస్ఎంఎస్ ఆఫీస్, కమిషనరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. కానీ, సమన్వయం కొరవడడంతో రోజులు గడిచిపోతున్నాయని ఆరోపించారు. సీఎస్ఎంఎస్ కార్యాలయంలోని సిబ్బంది వారానికి ఐదు రోజులు అది కూడా సమయాలు పాటించకుండా విధులు నిర్వర్తించడం కూడా ఉద్యోగుల ఇబ్బందికి కారణమవుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లామని, ఆయన అధికారులను ఆదేశించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. దీంతో నెల క్రితమే ధర్నా నోటీసు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. స్థానికంగా డీఐఎస్ (ఎంఈవో-1) కూడా తమ పట్ల నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని టీచర్లు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు సానుకూలంగా స్పందించడంతో మంగళవారం సాయంత్రం ధర్నా విరమించామని.. రెండ్రోజుల్లో జీతాలు టీచర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోతే ఉద్యమిస్తామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి



అనపర్తిలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సనత్‌కుమారి

- జిల్లా వైద్య సేవల సమన్వయాధికారిణి డాక్టర్ సనత్‌కుమారి

అనపర్తి, మార్చి 12: ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు చక్కని వైద్య సేవలు అందిస్తున్నామని, గ్రామాల్లో పర్యటించే ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ సనత్‌కుమారి అన్నారు. మంగళవారం అనపర్తిలోని తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ కళావేదికలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యులు, సిబ్బందితో ప్రసవాలు, ప్రసూతి సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో నమోదైన గర్భిణుల వివరాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల సంఖ్యపై విడివిడిగా సమీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంటున్నాయని, వైద్యులు సేవలందిస్తున్నారని, ప్రసవాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొన్ని పీహెచ్‌సీల పరిధిలో సిబ్బంది వెనుకబడి ఉన్నారని వచ్చే సమావేశం నాటికి పరిస్థితిని మెరుగు పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, వైద్యులు వరలక్ష్మి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి వైసీపీలో వర్గ విభేదాలు

- మండలంలో పార్టీ ముక్కలవ్వడానికి మంత్రి వనితే కారణం
- కొవ్వూరు ఇన్‌చార్జికి వివరించిన మండల మాజీ అధ్యక్షుడు

తాళ్లపూడి, మార్చి 12: హోం మంత్రి తానేటి వనిత నియోజకవర్గమైన కొవ్వూరులో వైసీపీలో వర్గ విభేదాలు మరోసారి బయట పడ్డాయి. మంత్రి వనిత తీరు వల్లే నాయకత్వానికి దూరంగా ఉన్నానని మండలంలో పార్టీ ముక్కలుగా అవ్వడానికి గల కారణాలను వైసీపీ తాళ్లపూడి మండల మాజీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవ నారాయణ ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు మలకపల్లిలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో వెల్లడించారు. మలకపల్లిలో కుంటముక్కల భాస్కరరామారావు గృహంలో ఎమ్మెల్యే తలారితో నాయకులకు, కార్యకర్తలకు పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి వనిత నడిచిన తీరును తలారికి చెప్పారు. 2019 ఎన్నికల ముందు పార్టీని నడిపించిన నాయకులు దూరమవ్వగా కేవలం మంత్రిని పొగుడుతూ భజన చేసే కేడర్‌కు ప్రత్యేక గుర్తింపునిచ్చి ప్రతి గ్రామంలోనూ రెండేసి వర్గాలుగా చీల్చి పరిపాలన సాగించారని కేశవ తెలిపారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారికి గుర్తింపు లేకపోవడం భజనలతో హఠాత్తుగా పుట్టుకొచ్చిన వారికి పెద్దపీట వేయడం వంటి మంత్రి వనిత చర్యలు మండలంలోని అన్ని గ్రామాల్లో నాయకులు ఎదుర్కొన్నారన్నారు. పార్టీపై అభిమానం అందరికీ ఉందని, వ్యవస్థను అస్తవ్యస్థంగా మార్చిన కారణంగా సీనియర్ కేడర్ ఎక్కువ మంది పార్టీకి దూరంగా ఉన్నారన్నారు. కొవ్వూరు నియోజకవర్గ వైసీపీకి మంత్రి పదవి దక్కడమే శాపం అనే విధంగా పరిస్థితులు మారాయని, నియోజకవర్గంలోని నాయకులకు, కార్యకర్తలకు భరోసా ఇచ్చే పెద్ద కూడా అవసరమని కేశవ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండలంలోని వైసీపీ సీనియర్ కేడర్ నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

గోపాలపురం, మార్చి 12: బైక్‌ను ఓ స్కూల్ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం గోపాలపురంలోని దుర్గమ్మ గుడి వద్ద బైక్‌పై వెళ్తున్న స్థానిక బీసీ కాలనీకి చెందిన చింతపల్లి రాంబాబును ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు అతడి కుడికాలు పైనుంచి వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జైంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.సతీష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రేషన్‌డీలర్ మృతదేహం లభ్యం

కొవ్వూరు, మార్చి 12: అదృశ్యమైన రేషన్‌డీలర్ మృతదేహాన్ని గోదావరి నదిలో గుర్తించినట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. రాజమహేంద్రవరం దేవిచౌక్‌కు చెందిన బత్తుల రామారావు రేషన్‌డీలర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించకపోవడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఔరంగాబాద్ సమీపంలో గోదావరి నదిలో లంకల వద్ద మృతదేహాన్ని గుర్తించి బయటకు తీయించారు. పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు వెంకటరమణమూర్తి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు

కొవ్వూరు, మార్చి 12: సరైన ఉద్యోగం రాలేదని యువకుడు గోదావరిలో దూకి గల్లంతయిన సంఘటన కొవ్వూరులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం మల్లయ్యపేట ఆర్‌అండ్‌బీ కాలనీకి చెందిన పట్నాల వీరవెంకట శివ సత్యనారాయణ (22) వండ్రంగి పనిచేస్తుంటాడు. తనకు సరైన ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందుతుండేవాడు. మంగళవారం ఉదయం ఇంటర్వ్యూకి వెళ్తున్నానని తల్లికి చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కొంత సమయం తరువాత తల్లి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో స్నేహితుడు తోట శివరామకృష్ణ సెల్ నుంచి ఫోన్‌చేస్తే 'మా అన్నయ్య ఉన్నాడా వీడియో కాల్ చేయమను' అని అన్నాడు. ఫోన్‌లో తల్లితో మాట్లాడుతూ తాను గామన్‌బ్రిడ్జిపై ఉన్నానని, గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాని చెప్పడంతో వెంటనే తల్లి, సోదరుడు కలిసి శివరామకృష్ణ ఆటోలో వంతెనపైకి వచ్చారు. గామన్ వంతెన 12 స్తంభం పైనుంచి సత్యనారాయణ గోదావరిలో దూకేశాడు. వెతికినా ఆచూకీ లభించక పోవడంతో యువకుడి అన్నయ్య పట్నాల దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ ఎం.సునోద్‌కుమార్ తెలిపారు.

నల్‌జల్ మిత్రలకు అవగాహన సదస్సు



ధవళేశ్వరం, మార్చి 12: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్‌లో భాగంగా హర్ ఘర్ జల్ (ఇంటింటికి తాగునీరు అందించండి)కార్యక్రమానికి ఎంపిక చేసిన నల్‌జల్ మిత్రలను నైపుణ్యవంతులుగా తయారు చేయడానికి మంగళవారం బొమ్మూరులోని నాక్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి జిల్లా వ్యాప్తంగా ఉన్న జల సంఘాల నుంచి 35 మంది మహిళా ప్రతినిధులు హాజరైనట్టు నాక్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ జె.రాజు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నాక్ జోనల్ అధికారి మురళీధర్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధి కారి ఎం.కొండలరావు, మాస్టర్ ట్రైనర్ ఎం.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో పోలీసులు అప్రమత్తత

ఓ ప్రయాణికుడి బ్యాగ్‌లు సురక్షితం

రూ.81 వేల నగదుతో అప్పగింత



బ్యాగ్‌ని అందజేస్తున్న సీఐ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషనులో రెండు బ్యాగులను మరిచిపోయి వెళ్లిపోయిన ప్రయాణికుడికి టూటౌన్ పోలీసులు సురక్షితంగా వాటిని అందజేశారు. కపిలేశ్వరపురానికి చెందిన ఏడ్నూతుల వెంకటరమణ మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కాశీ నుంచి రాజమహేంద్రవరం రైలులో వచ్చారు. కపిలేశ్వరపురం వెళ్లడానికి కారు ఎక్కే క్రమంలో రెండు బ్యాగ్‌లను మెయిన్ గేటు వద్ద ఆదమరుపుగా వదిలి వెళ్లిపోయారు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న టూటౌన్ సీఐ వి.శ్రీనివాసరావు వాటి గురించి ఆరా తీయగా ఫలితం లేకపోయింది. దీంతో వాటిని స్టేషనుకు తీసుకొచ్చి బ్యాగ్‌లను పరిశీలించి ఆధార్ కార్డు ఆధారంగా వెంకటరమణకు సమాచారం ఇచ్చారు. ఆయన టూటౌన్ స్టేషనుకు రావడంతో బ్యాగ్‌లను అప్పగించారు. ఓ బ్యాగ్‌లో రూ.81వేలు ఉన్నాయని, పోలీసుల దయవల్ల ఆ నగదు సురక్షితంగా దక్కిందని బాధితుడు పేర్కొన్నాడు. సీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా విధుల్లో నిబద్ధత చూపిన సీఐ శ్రీనివాసరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

జాబ్‌ఫెస్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలి

కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సీఈ శోభారాణి



జాబ్ ఫెస్ట్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శోభారాణి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12: విద్యార్థులకు డిగ్రీ పట్టాను అందించడమే కాకుండా వారిని ఉద్యోగస్థులుగా చేసి పంపించాలనే లక్ష్యంతో జాబ్ ఫెస్ట్ ఏర్పాటు చేసినట్లు జోన్ -1, జోన్- 2 కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సీఈ బి.శోభారాణి చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జాబ్‌ఫెస్ట్-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ జాబ్‌ఫెస్ట్‌కు 10 నోడల్ రిసోర్సు సెంటర్ల నుంచి 750 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, ఐటీ మొదలైన రంగాలకు చెందిన 24 కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు. 269 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఎస్ఆర్‌సీ కో ఆర్డినేటర్ తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ, నోడల్ రిసోర్సు సెంటర్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ ఫెస్ట్‌లో ఆయా సంస్థల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు మధు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం సీతంపేట రామాలయం వద్ద మంగళవారం యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మధు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకు డిమాండ్స్ ఏ ఒక్కటీ నెరవేరలేదని సమ్మెకాలం జీతం అమలు చేయలేదని, పెరిగిన జీతం కూడా పడలేదని అన్నారు. ఎన్నికలకు ముందు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్లను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. తమకు ఏ పార్టీ మేలు చేస్తుందో వారికే మున్సిపల్ కార్మికుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు రమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

సహోద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో ఓ పోలీసు కానిస్టేబుల్ మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని జిల్లాలోని పోలీసులు ఆదుకున్నారు. ఆర్థిక సాయం అందించారు. కానిస్టేబుల్ వీబీ జయదేవ్ (పీసీ 3694) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్ వారి కోసం మొత్తం రూ.3 లక్షలు సేకరించారు. వాటిని ఎస్పీ జగదీశ్ మంగళవారం జయదేవ్ కుమార్తె, భార్యకు అందజేశారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దివాన్‌చెరువు, మార్చి 12: సమయం ఎంతో విలువైనదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు సహాయాచార్య తలారి వాసు కోరారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు సేవా ఉగాది, శ్రీమహాగణపతి యువజన సేవాసమితి వ్యక్తిత్వ వికాస సదస్సును మంగళవారం నిర్వహించింది. హెచ్ఎం లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వాసు మాట్లాడుతూ పదో తరగతి తర్వాత సమున్నతమైన విద్యల వైపు వెళ్లడానికి, విలువలు గల వ్యక్తులుగా మనగలగడానికి సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శర్మ, సేవా ఉగాది తరఫున నీలపాల శ్రీనివాస్, గ్రంధి గణేష్, శ్రీను, బబ్లు పాల్గొన్నారు.

పిరమిడ్ ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

బిక్కవోలు, మార్చి: కొంకుదురులోని శ్రీశివరామకృష్ణ పిరమిడ్ ధ్యాన కేంద్ర వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్ నల్లమిల్లి అనపూర్ణ భగవద్గీతలోని శ్లోకాలను అర్థాలతో సహా వివరించారు. అనంతరం దివంగత గొలుగూరి భాస్కరరెడ్డి, సుశీల దంపతుల కుటుంబ సభ్యులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	సిద్ధార్థ్‌రాయ్
వై.స్క్రీన్2	ఈగల్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	ఊరి పేరు భైరవ కోన
నిడదవోలు	
వీ మ్యాక్స్	గామి
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	వ్యూహం
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	గామి
త్రినాథ్	భీమా
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్